# మారుతున్న లైంగికత – కొత్త హక్కుల చర్చ

బాలగోపాల్ స్మారక సదస్సులో చదివిన ప్రసంగవ్యాసం
7 అక్టోబర్ 2018

## ఎ. సునీత





భిన్న స్వరాలు ▪ తెనాలి

మారుతున్న లైంగికత - కొత్త హక్కుల చర్చ

బాలగోపాల్ స్మారక సదస్సులో చదివిన ప్రసంగ వ్యాసం
7 అక్టోబర్ 2018

ఎ. సునీత


భిన్న స్వరాలు ప్రచురణ నెం. : 2

మొదటి ప్రచురణ : 8 అక్టోబర్ 2019

డిటిపి : నూతన ప్రవల్లిక

డిజైనింగ్, బుక్ మేకింగ్ : జుగాష్‌విలి

ముద్రణ : చరిత ఇంప్రెషెన్స్, హైదరాబాద్

ప్రతులకు :
జి.ఎస్.నాగేశ్వరరావు అడ్వకేట్,
ఎన్.జి.ఓ. మేడమీద, కొత్తపేట, తెనాలి-522201
సెల్: 7981582807
మెయిల్ : gsnr.advocate@gmail.com

మరియు ప్రముఖ పుస్తక కేంద్రాలలో..

**వెల : రూ.10**

# మారుతున్న లైంగికత - కొత్త హక్కుల చర్చ

**ఈ** సమావేశానికి నన్ను ఆహ్వానించిన వసంతలక్ష్మి, కృష్ణ గార్లకి నా కృతజ్ఞతలు. పౌర హక్కులు, మానవ హక్కుల ఉద్యమంలో రాజకీయాల గురించి నేర్చుకున్న నాకు ఇక్కడ మాట్లాడటం ఇది నాకు ఒక రకంగా స్వంత ఇంటికి రావటం వంటిది. ఈ రోజు బాలగోపాల్ ఇక్కడ వుండి ఉంటే బాగుండు అని ఇక్కడున్న చాలామందితో సహా నేను కూడా కోరుకుంటున్నాను. 1990ల చివర్లో నాకు బహిరంగ సభల్లో మాట్లాడటం కొత్తయినప్పుడు నేను కష్టపడటం విన్న అయన ఈ రోజు నేను మాట్లాడింది విని 'పర్లేదు, ఈ అమ్మాయికి కూడా విషయాలు మాట్లాడ్డం వచ్చింది' అని బహుశా భావించేవాడేమో!

ఈ రోజు చర్చకి మన ముందున్న విషయం: లైంగికత, లైంగిక హక్కులు, లైంగిక హింస. రోజు రోజుకి స్త్రీలు (జన్మతః లేదా తరువాత స్త్రీలుగా పరిణమించిన), బాలురు, బాలికలపై జరిగే వేధింపులు, హింస గురించి ఎక్కువవుతున్న వార్తలు అందరినీ కలవర పెడుతున్నాయి. వాటికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు, ప్రజా స్పందన మరో పక్క ఈ వేధింపులని, హింసని రాజకీయం చేసి చట్టపరమయిన, విధాన పరమయిన స్పందన కోసం అడుగుతున్నాయి. గత నెల రోజులుగా ఊపందుకున్న 'మీటూ ఉద్యమం' దీన్ని

ముందుకు తీసుకుపోయి ముఖ్యంగా కులీన స్త్రీలు చదువుకునే, పనిచేసే బహిరంగ/ విద్యా/ పనిస్థలాల్లో లైంగిక వేధింపుల సంస్కృతిని ఇంతకు ముందు ఎన్నడూ లేనంత బలంగా ప్రశ్నిస్తోంది. ఇంత స్పృహ, స్పందన పెరిగినప్పటికీ ఎందుకు వేధింపులు, హింస ఆగట్లేదు అన్న బాధ, కోపం, కసి కూడా చాల మందిలో మరో పక్క పెరుగుతున్నాయి.

ఈ పరిణామాలన్నిటినీ 'స్త్రీల పెరుగుదలని ఆపుతున్న పితృస్వామ్య హింస: దానికి ఎదురవుతున్న వ్యతిరేకత" అన్న చట్రంలో అంటే, స్త్రీలు ముందుకు వెళ్తుంటే సహించలేని పురుషులు ఈ హింసకి పాల్పడుతున్నారని విశ్లేషించ వచ్చు. హక్కుల కార్యకర్తలుగా ఆయా సంఘటనలలో బాధితులకి సహకారం అందించటానికి ఇటువంటి విశ్లేషణ కొంత మేరకు పనికొస్తుంది. కానీ వివిధ సంఘటనల ప్రత్యేక నేపథ్యం మరియు చారిత్రక సందర్భాలని పక్కకి పెట్టి అందరినీ 'స్త్రీలు- పురుషులు' అనే సంకుచిత చట్రంలో చూస్తే ఈ విశ్లేషణ పరిమితంగానే ఉపయోగ పడుతుంది. అంతే కాక, స్త్రీలు, పురుషులు అందర్నీ తన కనుకూల రీతిలో మారుస్తూ, నెడుతున్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక శక్తుల గురించి కూడా మనకర్థం చేయించదు. హింస ఎక్కువయ్యేది మార్పు జరిగే సమయంలోనే నన్నది మనందరికీ తెలిసిన విషయమే కాబట్టి లైంగిక హింస, వేధింపుల ఘటనల్లో వ్యక్తమవుతున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ మార్పుల విస్తృతిని అర్థం చేసుకోవటం, కనీసం దాని కోసం ప్రయత్నించటం చాలా అవసరం. ఇక్కడ ముఖ్యంగా జరుగుతున్న హింస, వేధింపులని లైంగిక హక్కుల ఉల్లంఘనలుగా పరిగణించే అవగాహన గురించి కూడా ఆలోచించాలి. ఇది ఎప్పటినుండో వస్తున్న అవగాహనా లేక కొత్తగా వచ్చిన అవగాహనా, కొత్తదయితే ఏ పరిస్థితులు ఈ అవగాహనకి దారి తీస్తున్నాయన్నది విశ్లేషించటం అవసరం. హక్కుల కార్యకర్తలుగా హక్కుల్ని ఎలా కాపాడుకోవాలి, ఉల్లంఘనలని ఏ రకంగా వ్యతిరేకించాలి, ఉద్యమం ఎలా నిర్మించుకోవాలి అన్న స్పృహతో ఆలోచించటం ఎంత అవసరమో, ఇటువంటి విశ్లేషణ కూడా అంతే అవసరం. అపుడే లైంగిక హింస, వేధింపులని లైంగిక హక్కులకి ముడి పెట్టి ఆలోచించే స్పృహ, అవగాహన కల్పించటంలో ప్రజా ఉద్యమాల పాత్ర గురించి మాత్రమే కాక రాజ్యం, విపణి, పెట్టుబడి, పాపులర్ కల్చర్ తెచ్చే వ్యవస్థీకృత మార్పులు పోషిస్తున్న బలమయిన, లోతయిన పాత్ర గురించి ఆలోచించగలం. వీటి పాత్రని

అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే లైంగిక హింస, వేధింపులు లైంగిక హక్కుల స్పృహకి ఎలా జత చేయబడుతున్నాయి, ఇటువంటి లైంగిక హక్కుల స్పృహ కల్పిస్తున్న చారిత్రిక అవకాశాలని, అలాగే, దాని పరిమితులని విశ్లేషించటం కూడా సాధ్య పడుతుంది.

లైంగికత అనంగానే స్త్రీ పురుషుల మధ్య కలిగే ఆకర్షణకి లేక శృంగారానికి సంబంధించిన అంశంగా, దాన్ని, దానిపై సంఘం విధించే సాంఘిక, సాంస్కృతిక కట్టుబాట్లు, నియమాల గురించి విశ్లేషించటమే లైంగికతకి సంబంధించిన ప్రధాన చర్చగా అర్థం చేసుకోవటం కద్దు. అయితే ఇది సమాజ నియమాలకు (నార్మేటివ్ ఇంజంక్షన్స్) లోబడి సైద్ధాంతిక చర్చకి ముందే పరిమితులు విధించుకోవట మవుతుంది. లైంగికత మానవ జీవితంలో అనేక పార్శ్వాలని స్పృశించే కీలక మైన, విస్తృతమైన అంశం, విషయం, దానిలో అంతర్భాగం. దాని వ్యక్తీకరణలో భాగంగా ఈ మధ్య మన ముందుకొచ్చిన విషయాలని చూస్తే దాని విస్తృతి అర్థం చేసుకోవచ్చు. నచ్చిన బట్టలు వేసుకోవటం, తమకు సంతోషమిచ్చే పనులు చెయ్యటం, తమకు నచ్చిన లైంగిక భాగస్వాములతో – ఒకటే జెండర్ కావచ్చు, వేరే జెండర్ కావచ్చు! కలిసి జీవించటం, కష్టంగా ఉంటే జెండర్ని మార్చుకోవటం, రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో హాయిగా తిరగ గలగటం, కులం, మతంతో నిమిత్తం లేకుండా జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వతంత్రం, ఒంటరిగా జీవించే అవకాశం, పెళ్లితో అవసరం లేకుండా లైంగిక సంబంధాలు, కలిసి జీవించే అవకాశం కావాలనటం, అమ్మాయిల కదలికలపై హాస్టళ్లలో, ఇళ్లలో వుండే కట్టుబాట్లు ఎత్తివేయాలనటం, పార్కులు, టీ షాపులు, రోడ్లు పరలైంగిక పురుషుల కెంత చెందుతాయో తమకి కూడా చెందాలని స్త్రీలు, ట్రాన్సజెండర్ వ్యక్తులు అడగటం. వీటన్నిటిలో తమ శరీరాలపై, ఇష్టా ఇష్టాలపై, కోరికలపై ఇతరులు (కుటుంబం, కమ్యూనిటీ, రాజ్యం కూడా) పెట్టే అసంబద్ధ నియంత్రణ ఉండకూడదనే అంశంతో పాటు, బహిరంగ ప్రదేశాలు, నివాస స్థలాలు, సమాజ వనరులు, అవకాశాలు వీటికనుగుణంగా మారి, తమక్కూడా ఉపయోగపడాలి, చెందాలనే బలమైన ఆకాంక్షలు తోడయ్యి వున్నాయి.

గత కొన్నేళ్లుగా దేశ ఉన్నత న్యాయస్థానం జెండర్, లైంగికతల గురించి వరస బెట్టి ఇస్తున్న తీర్పులు వ్యక్తిగతం, వ్యక్తిగత స్వేచ్ఛకి సంబంధించి జరుగుతున్న మార్పులకి అద్దం పడుతూ, వాటిని బలపరిచే విధంగా వెలువడుతున్నాయి.

2009లో సమలైంగికత, జెండర్ గురించి ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు వ్యక్తిగత లైంగిక జీవితంలో ఎవరు జోక్యం చేసుకోకూడదని చెపితే, నల్సా తీర్పుతో ట్రాన్సజెండర్ వ్యక్తులకి గుర్తింపు లభించింది. 2018 సంవత్సరం మొదట్లో ప్రయివసీని రాజ్యం, మార్కెట్ గౌరవించాలని, అంత కంటే ముఖ్యంగా వ్యక్తిగతాన్ని ప్రాథమిక హక్కుల్లో భాగంగా పరిగణించాలని ఇచ్చిన తీర్పు సెప్టెంబర్ 2019లో 377 పరిధి నుండి సమలైంగికులని తీసేసి, వారికి రాజ్యాంగ పరమైన హక్కులు కల్పించాలనే కోర్టు తీర్పుకి దారితీసింది. 377 సెక్షను, అదే నెలలో ఐపీసీ 497 కింద ఇక నుండి అక్రమ సంబంధాన్ని నేరం కింద పరిగణించమని వచ్చిన రెండు తీర్పుల్లో కూడా ఇద్దరు వయోజనులైన వ్యక్తుల మధ్య అంగీకారంతో ఏర్పడే వ్యక్తిగత సంబంధాలని రాజ్యం నేరపూరితం చెయ్యటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కోర్టు గట్టిగా నొక్కి చెప్పింది. స్త్రీల పట్ల, హాజీ అలీ దర్గాహ్ కావచ్చు, శబరిమలై ట్రస్ట్ కావచ్చు, తమ వివక్షా పూరిత ధోరణులని మార్చుకోవాలని ఇచ్చిన తీర్పులు, అలాగే స్త్రీలని ఆస్తిలా పరిగణించ కూడదని చెప్పిన 497 తీర్పు కూడా ఈ కోవకి చెందినవే. ఈ తీర్పులన్నిటినీ ముడి వేసే దారాలు వ్యక్తిగత స్వేచ్ఛ, అంగీకారం, లైంగిక సమానత్వ భావనలు.

ప్రజా ఉద్యమాలు ఒక్కటే ఆయా వ్యక్తీకరణలకు, వాటి వ్యవస్తీకరణకి అవకాశం, భూమిక ఏర్పరుస్తున్నాయా అనే ప్రశ్న వేసుకుంటే బహుశా కాదని సమాధానం వస్తుంది. గత ఇరవై ఏళ్లుగా వేళ్లూనుకున్న ఉదారవాద రాజ్యం, పెట్టుబడి, దాని కనుగుణంగా రూపు దిద్దుకుంటున్న జన సమ్మత సంస్కృతి (పాపులర్) పాత్ర వీటి ఏర్పాటులో చాలా కీలకం. ఆయా ధోరణులకు ప్రధాన భూమిక అయిన 'వ్యక్తి వాదం' – (ఇండివిద్యువిలిజం), ఇదే పెట్టుబడి, రాజ్యం జరుపుతున్న హింస, విధ్వంసం మధ్యలో రూపుదిద్దుకుంటున్న పరిణామం. ఒక పక్క ప్రజల నివాస, భూమి, ఆవాస హక్కుల్ని కాలరాస్తున్న నయా ఉదారవాద పెట్టుబడి, రాజ్యం, సంస్కృతి అదే సమయంలో వ్యక్తిగత లైంగిక హక్కుల్ని – ముఖ్యంగా వ్యక్తిగతాన్ని, పరస్పర అంగీకారయుతమైన సంబంధాల్ని – ఎలా, ఎందుకు వ్యవస్తీకృతం చేస్తోందనే ప్రశ్న రావటం సహజం. ఇక్కడ మనం గుర్తించాల్సింది, 1990 తరువాత జరిగిన, జరుగుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాల వల్ల ఒక పక్క హింస, నియంత్రణ పెరుగుతుంటే, మరో పక్క ప్రగతిశీలమైన పరిణామాలు కూడా జరుగుతున్నాయి. ఈ వైరుధ్య

భరిత వాస్తవాన్ని అర్ధం చేసుకోవటమే ఈ ఉపన్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

మన కళ్ళ ముందే ఈ వైరుధ్యభరిత వాస్తవం ప్రతి రోజూ ప్రత్యక్షమవుతోంది. అంతర్జాలం ద్వారా వచ్చిన లైంగిక సమాచార విప్లవం, దానితో వెల్లువలా వచ్చిన పోర్నోగ్రఫీ, ఒక పక్క లైంగిక వికృతాలకి దారి తీస్తూనే, మరో పక్క లైంగికత పట్ల వుండే పాత భయాల్ని బద్దలు కొట్టి, లైంగికానందం ఒక అవసరం, ఇంకా చెప్పాలంటే మా హక్కు అనే అవకాశం పురుషులతో పాటు, సమలైంగికులకి, స్త్రీలకి కూడా కల్పిస్తోంది. లైంగిక చర్య/శృంగారానికి అవతలి వ్యక్తి అంగీకారం (కంసెంట్) అవసరమనే భావ ప్రచారానికి కూడా ఎంతో కొంత తోడ్పడుతోంది. రెండవది, ఫేస్బుక్ వంటి సామజిక మాధ్యమాలు స్వయం ఆరాధనకు ఒక పక్క తెర తీస్తూనే, మరో పక్క, భిన్న రకాల లైంగిక అస్తిత్వ భావాలకి పునాదులు కూడా ఏర్పరుస్తున్నాయి. ఫోటోలు షేర్ చేసుకోవటం కావచ్చు, తమ లాంటి వాళ్ళు ఎంతో మంది ఉన్నారనే  ఎరుక పెరగటం కావచ్చు, తమ జీవితం విధిస్తున్న నిర్బంధంలోనే కాకుండా వేరే రకంగా జీవించొచ్చని అర్ధమయ్యి కలిగే ఆశ కావచ్చు – ఇలా అంతర్జాలం ఇస్తున్న వెసులుబాటు వల్ల కుటుంబం, కుల సమాజం బలంగా నిర్దేశించి, అమలు పరిచే కట్టుబాట్లు, ముఖ్యంగా ఎవరితో ఎవరు కలవచ్చు అన్న విషయం గురించిన నియమాలు సడలుతున్నాయి. బహుశా పెరుగుతున్న కుల హత్యలు, ఖాప్ హత్యలు, సామూహిక అత్యాచారాలు ఈ కదలికని తట్టుకోలేని చర్యలే కావచ్చు. ఒక రకంగా చెప్పాలంటే కన్పిస్తున్న ఈ వైరుధ్యాలు భారతీయ సమాజంలో వేళ్ళూనుకున్న పెత్తందారీ భావజాల ఊగిసలాటని, దాని నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న లైంగిక హక్కుల స్పృహని మన కళ్ళ ముందుకు తెస్తున్నాయి. మనమనుకున్న రీతుల్లో కాకుండా లైంగిక హక్కుల స్పృహకి దారులు ఏర్పడుతున్నాయని గుర్తించాల్సిన సమయం వచ్చింది. అయితే, హక్కుల కార్యకర్తలుగా కానీ, హక్కుల వ్యవస్థీకరణ గురించి ఆలోచించే వారుగానీ ఈ వైరుధ్య భరిత వాస్తవాన్ని ఎలా అర్ధం చేసుకోవాలి?

మొదట మనం చర్చించుకోవాల్సింది లైంగికతకి సంబంధించిన 'హక్కులు' ఎవరు, ఎక్కడ, ఏ సందర్భంలో ఎలా వ్యక్తీకరిస్తున్నారు అన్న ప్రశ్నలు. సాధారణంగా మనం ఎవరు అన్న ప్రశ్నలో పరిగణించే జెండర్, కులం, వర్గం,

లైంగిక ధోరణులే కాక, అసలు లైంగికత క్రియాశీలకంగా ఆయా సంఘటనల్లో ఎలా వ్యక్తీకరింప బడుతోంది అన్న విషయం కూడా ప్రత్యేకంగా గమనించాలి. ఎక్కడ అన్న ప్రశ్నని కూడా ఒక ఫిజికల్ స్పేస్‌కి సంబంధించిందిగా మాత్రమే కాక అంతర్జాలం, మీడియా వంటి వర్చ్యువల్ స్పేస్‌తో కూడా కలిపి అర్థం చేసుకోవాలి. నా కిచ్చిన చర్చనీయాంశంలో వేధింపులు, హింస భాగం కాబట్టి ప్రధానంగా అటువంటి సందర్భాలనే తీసుకుని ఈ ప్రశ్నల్ని చర్చించుకుందాము. మనం దీన్ని గత ఇరవయ్యేళ్లలో జరిగిన వివిధ రకాల సంఘటనల్లో ఎక్కడనుండయినా మొదలు పెట్టచ్చు కానీ, ప్రధాన స్రవంతి చర్చల్లోకి వచ్చి, ఎంతో కొంత నన్ను ప్రభావితం చేసిన సంఘటనలని తీసుకుని చేస్తే బాగుంటుందని నాకనిపించింది. ఆ రకంగానే మొదలు పెడతాను.

వాటిలో మొదటిది, 2012 నుండి హర్యానా రాష్ట్రంలో వెల్లువలా బయటికొస్తున్న దళిత అమ్మాయిలపై జరుగుతున్న సామూహిక అత్యాచారాలు (ఇప్పటికివి అందరు స్త్రీలకి పాకాయనుకోండి). ప్రధానంగా జాట్ కులానికి చెందిన యువకులు చేస్తున్న ఈ లైంగిక అత్యాచారాలని అక్కడి దళిత సంఘాలు, కుటుంబాలు పెద్ద ఎత్తున బహిరంగ పరిచాయి. ఈ అమ్మాయిలందరూ దాదాపు చదువుకుంటున్న వాళ్ళే. స్కూలు కెళ్లే దారిలో జరిగిన ఈ అత్యాచారాల్లో కొన్ని ఇరుగు పొరుగు వాళ్ళు చేసినవి వున్నాయి, కొన్నిట్లో మగ స్నేహితులు, తమ సహచరులతో కలిసి  జరిపినవి వున్నాయి. కొంత మంది అమ్మాయిలని 'జీన్స్' వేసుకున్నందుకు టార్గెట్ చేసిన సంఘటనలు కూడా వున్నాయి. వీటిని కుల అత్యాచారాలని నిర్వచించి దళిత కమ్యూనిటీ ఆక్టివిస్టులు ఫిర్యాదుల నమోదుకు తీవ్రంగా ప్రయత్నించారు, కొన్నిట్లో, అతి కొన్నిట్లో నమోదు చేయించ గలిగారు. ఇక్కడ విషయం ఏమిటంటే, దళిత అమ్మాయిలు కుల వ్యవస్థ విధించిన కట్టుబాట్లు దాటి చదువుకోవటమే కాక ఇతర కులాలకు చెందిన అబ్బాయిలతో సమానంగా మాట్లాడి, స్నేహం చెయ్యటం, దళిత కుటుంబాలలో పెరుగుతున్న విద్య, ఉద్యోగాలు, అక్కడి ఆధిపత్య కుల సమూహాలకు కంటగింపుగా పరిణమించాయని అక్కడి అన్ని ప్రజాస్వామ్య సంఘాలు చెప్తున్నాయి. మా అమ్మాయిలకి రక్షణ కల్పించాలని, అత్యాచారం చేసిన వారిని తగినంతగా శిక్షించాలని దళిత సంఘాలు, ఆయా కుటుంబాలు నిరసన చేస్తుంటే, జాట్లు, వాళ్ళ కుల పంచాయితీలు మాత్రం కేవలం అమ్మాయిలు హద్దు దాటి ప్రవర్తించటం వల్లే

ఇవి జరుగుతున్నాయని ఇప్పటికీ వాదిస్తున్నారు. అమ్మాయిలు 'హద్దులు' దాటటం వాస్తవమే. ప్రకటిత రాజ్యాంగం అందరూ, ముఖ్యంగా స్త్రీలు, అదీ అణగారిన వర్గాల స్త్రీలు చదువుకోవాలని చెప్తుంటే, ఆధిపత్య కుల సమూహాలు తాము ఇన్నాళ్లు విధించిన అప్రకటిత రాజ్యంగం ద్వారా తమపై ఆర్థికంగా ఆధారపడిన దళిత, ఇతర అణగారిన సమూహాల పైన కుల-పితృస్వామిక ఆంక్షలు - ఏ బట్టలు వేసుకోవాలి, ఎట్లా నడవాలి, ఏ తిండి తినాలి, ఎక్కడ చదవాలి, ఎట్లా నడుచుకోవాలి అన్నింటిపై విధించిన హద్దులు (దక్షిణ భారత దేశంలో కొంత ముందే జరిగిందీ ప్రక్రియ) సడలుతున్నాయి. దీని వల్ల కుల ఆధిపత్యానికి, దానిపై ఆధారపడిన కుల పురుషాహంకారానికి దెబ్బ తగులుతోందనటానికి ఈ అత్యాచారాలు, హత్యలు, నిరసన కారులపై దాడులు సూచన. రాజ్యాంగం, చట్టం గుర్తించిన స్త్రీలపై జరిగే శారీరిక, లైంగిక హింసకి సంబంధించి ప్రజారంగంలో చర్చ ప్రధానంగా ఇప్పటికీ బాలికలు, యువతులు, స్త్రీలు పాటించాల్సిన 'హద్దుల' చుట్టూ తిరగటం బాధాకరమే అయినా, ఇక్కడ గమనించాల్సిన విషయం దళిత సమూహాలపై, స్త్రీలపై కుల నియంత్రణ సడలటం.

ఈ సంఘటనలు దేశంలో మిగిలిన వారిని పెద్దగా కదిలించ లేదు కానీ, 2012 డిసెంబర్లో ఢిల్లీలో పిజియోథెరపీ విద్యార్థిని జ్యోతి సింగ్‌పై జరిగిన క్రూరమైన, సామూహిక అత్యాచారం, బహుశా ఢిల్లీలో జరగటం వల్ల కాబోలు, అందర్నీ కదిలించింది. తన స్నేహితుడితో కలిసి సినిమా చూసి ఇంటికి తిరిగొస్తున్న విద్యార్థినిపై జరిగిన ఈ ఘటన దేశంలోని యువతరాన్ని కుదిపేసింది. ఎందుకు? బహుశా, చాలా మంది వాళ్ళిద్దరిలో తమని తాము చూసుకుని, అటువంటి పరిస్థితుల్లో తాము కూడా ఉండి ఉండొచ్చని అనుకున్నారు. అత్యాచారం చేసిన వాళ్ళు క్రింది వర్గానికి చెందిన వారు కావటం కూడా ఈ కోపానికి ఒక ప్రధాన కారణం కావచ్చని విశ్లేషకులన్న మాట కూడా నిజమే. మధ్య తరగతి అమ్మాయిలు రాత్రి పూట స్వతంత్రంగా తిరిగితే ఏం జరుగుతుందని తల్లి తండ్రులు భయపడి, వారిని భయపెడతారో అటువంటి సంఘటన జరగటం, అత్యాచారం అనంగానే రోడ్డు మీద పనీ-పాటా లేని అపరిచిత పోరం బోకులు పెళ్లి కాని యువతులపై లైంగిక ఉద్రేకంతో చేసేదనే బలమైన నమ్మకం నిజమవటం రెండూ కూడా ఈ కలవరానికి తోడ్పడ్డాయి. అత్యాచారానికి

పాల్పడిన ఈ మగవాళ్ళు ఎవరు? ఢిల్లీ చుట్టు పక్కల రాష్ట్రాల నుండి మహా నగరంలో పని చెయ్యటానికి వేల మంది యువకులు, కుటుంబాలు అక్కడికి వలస వస్తుంటారు. ఈ ముగ్గురూ అటువంటి కుటుంబాలకి చెందిన వాళ్ళు. తమ రోజువారీ జీవితంలో ఎటువంటి హక్కులు, వెసులుబాటు లేని చాకిరీతో కూడిన పని చేసే ఈ అసంఘటిత వలస శ్రామికులు. వాళ్ళల్లో కొందరికి అటువంటి అణచివేత నుండి బయట పడి థ్రిల్ పొందటానికి ఖాళీ రవాణా వాహనాలు ఉపయోగపడుతున్నాయని; వలస కారణంగా పట్టణంలో తాము కోల్పోయిన పురుషాధికారాన్ని 'స్వేచ్ఛగా' తిరుగుతున్న స్త్రీల మీద అత్యాచారాలు చేసి తిరిగి పొందుదామని చూస్తున్నారని కూడా విశ్లేషకులు చెప్పారు. ఢిల్లీకి చదువు కోసం వచ్చిన జ్యోతి సింగ్ వంటి దిగువ మధ్య తరగతి అమ్మాయిలు, తమ స్థాయిలో, నగరం ఇచ్చిన స్వేచ్ఛని ఉపయోగించుకోవటం బహుశా వారికి కంటగింపు అయుండొచ్చు. అయితే ఈ సందర్భంలో అనేక మంది రాజకీయ నాయకులు తమ వ్యాఖ్యలతో తాము కూడా ఇదే పద్ధతిలో ఆలోచిస్తున్నామని నిరూపించుకున్నారు. 'ఆ అమ్మాయి ఆ సమయంలో ఎందుకు బయటుంది', 'ఆ అబ్బాయితో ఎందుకుంది' అంటూ వయసొచ్చిన అమ్మాయిలని స్వతంత్రులుగా అంగీకరించలేమని చెప్పకుండా చెప్పారు.

వీరి ఆలోచనలు ఈ సందర్భంలో దేశ వ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న యువతుల ఆలోచనలకి పూర్తి భిన్నంగా వున్నాయి. అనేకమంది చదువుకుంటున్న యువతులు, ప్రజా రవాణా సౌకర్యాలు, వసతుల్ని మెరుగు పరచాలని, అవి 24 గంటలు అందుబాటులో ఉంటే స్త్రీలు సురక్షితంగా ప్రయాణించొచ్చనీ, వీధుల్లో, బస్సు స్టాపుల్లో లైట్లు వుండాలని, అలాగే, రక్షణ పేరుతో స్త్రీల కదలికల మీద నిబంధనలు పెట్టటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, దాని బదులు వారికి అవసరమయిన సెక్యూరిటీ పెంచాలని, పోలీసులు యువతులపై నిఘా కాకుండా వారి రక్షణ కోసం అవసరమయ్యే పోలీసింగ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. లైంగిక హింసని నియంత్రించాలంటే 'రక్షణ' పేరుతో యువతుల్ని మళ్ళా కుటుంబ, కమ్యూనిటీ, సమాజ నిర్బంధానికి లోను చెయ్యటం సరయిన పరిష్కారం కాదని బలంగా చెప్పారు.

కానీ వారడిగిందొకటయితే, జరిగింది మాత్రం మరొకటి. జాతీయ స్థాయిలో ఈ రెండు సంఘటనల్లో ప్రధానంగా, స్పష్టంగా వ్యక్తమయింది యువతీ యువకుల

లైంగికత, ముఖ్యంగా యువతుల లైంగికత గురించిన  ఆందోళన. కొంత మంది తల్లిదండ్రులు వారి భద్రత గురించి భయపడితే, చాలా మంది ఎవరి నియంత్రణ లేని స్వతంత్రులయిన అమ్మాయిలు తిరక్కూడని వారితో తిరుగుతారని, దాని వల్ల 'సమాజానికే' తీవ్ర నష్టం జరుగుతుందని అత్యంత ఆందోళన చెందారు. వారిపై, వారి కదలికలపై నియంత్రణ అవసరమని భావించారు. కొన్ని కళాశాలల్లో యూనిఫామ్ ప్రవేశ పెట్టారు. కొన్నిట్లో బస్సులు ప్రవేశ పెట్టారు. హాస్టళ్లలో సిసి టీవీ కెమెరాలు పెట్టారు, కాలేజీల్లో యువతులపై కర్ఫ్యూలు విధించారు. ఇదే వరసలో రాజకీయ నాయకులేమో వసతులు కల్పించే, మెరుగుపరిచే విషయం పక్కన పెట్టి లైంగిక నేరాల చట్టం కఠినతరం చెయ్యటానికి పూనుకున్నారు. ఇంకా చేస్తూనే వున్నారు. పోలీసింగ్‌లో భాగంగా ఉత్తర్ ప్రదేశ్ వంటి చోట్ల 'రోమియో స్క్వాడ్' పేరుతో బహిరంగ ప్రదేశాల్లో యువతీ యువకుల కదలికలపై నియంత్రణ పెంచారు.

ఈ రెండు రకాల ఘటనల్లో స్వయంగా బాధితులయిన వారి గొంతులు, బ్రతికి బయటపడిన హర్యానా దళిత బాలికల పైన వుండిన తీవ్ర వత్తిడి, అణచివేత వల్ల కావచ్చు, జ్యోతి సింగ్ మరణించటం వల్ల కావచ్చు, పెద్దగా వినిపించలేదు. కానీ, తొందర్లోనే, అటువంటి రెండు ఘటనలు ఈ తరం స్త్రీల గొంతుల్ని ముందుకు తెచ్చాయి. ఎంత దగ్గరివారయినా సరే, లైంగిక సంబంధాల్లో 'అంగీకారం' ఉండాలని పెద్ద ఎత్తున చర్చని లేవనెత్తాయి. ఇవి రెండూ మన ప్రగతిశీల సర్కిల్స్ గురించే అవటం కాకతాళీయం కాదు కూడా. మన దగ్గరి స్త్రీ వాద  ఉద్యమం 1970ల నుండి ప్రగతిశీల సముదాయాల్లో, అంటే అప్పట్లో కమ్యునిస్టు నేపథ్యం నుండి, ఇంకా పార్టీల్లో కూడా కొనసాగే పితృస్వామ్య ధోరణులు, స్త్రీల లైంగికత పైన అమలయ్యే నిఘా, కొన్ని సందర్భాల్లో పురుషుల అభ్యంతరకర ప్రవర్తన, అత్యాచారాల గురించి బాగానే చర్చని లేవదీస్తూ వచ్చింది. అయితే 2000 సంవత్సరం నుండి ఇప్పటికి రెండు కీలక పరిణామాలు జరిగాయి. మొదటిది, స్త్రీ పురుష సంబందాలలో స్త్రీల స్పష్టమైన అంగీకారం లేకుంటే ఆయా సంబంధాలని వేధింపులుగానో లేక దాడి లేక హింసగానో పరిగణించాలని, ఆయా పురుషులు ఎంత దగ్గరి వాళ్ళు, స్నేహితులు, గురువులు, చివరికి భర్తలు అయినా సరే అన్న భావన క్రమంగా ప్రజా రంగంలో చర్చలోకి వచ్చింది. 2013 నుండి ఈ భావన లైంగిక హింస, వేధింపులకు సంబంధించిన చట్టాల్లో

కొంత మేరకు భాగం కూడా అయింది. రెండవ మార్పు, అప్పట్లో ప్రగతిశీల సర్కిల్స్‌కి మాత్రమే పరిమితమైన ఈ చర్చ ఇప్పుడు ఎంతో కొంత ప్రధాన స్రవంతిలో భాగంగా జరుగుతోంది. పురుషుల కోరికలు తీర్చుకోవటానికి స్త్రీలు ఒక సాధనం కాదనీ, స్త్రీల ఇచ్ఛ, స్వతంత్రత ప్రధానమని స్త్రీవాద ఉద్యమం కలిగించిన స్పృహ ఈ దశాబ్దంలో జరిగిన లైంగిక హింస, వేధింపులకి సంబంధించిన చర్చలో భాగంగా ప్రధాన స్రవంతిలోకి రావటం ఆసక్తికరమైన పరిణామం. ఆయా స్త్రీలు పురుషులతో లైంగిక సంబంధాలకి అంగీకరించినా ఆ "అంగీకారం" ఇచ్చేలా చేసే పరిస్థితులు, దాని సాధ్యాసాధ్యాలు, రాజకీయాలు, అలాగే, స్త్రీల అంగీకారం స్వచ్ఛందంగా ఉండాలంటే ఎటువంటి పరిస్థితులు పని స్థలాల్లో, స్నేహ సంబంధాల్లో, కుటుంబంలో కల్పించాలన్న విషయానికి సంబంధించిన చర్చ అంత తేలిగ్గా అర్థమయ్యేది కాదని మనకి క్రింద చర్చించుకునే సంఘటనలు తెలుపుతాయి.

మొదటి సంఘటన ఢిల్లీలో ప్రగతిశీల సర్కిల్‌లో అందరికీ తెలిసిన చరిత్రకారుడు, కళాకారుడు అయిన మహమూద్ ఫారూఖీ తనని వేలితో అత్యాచారం చేసాడని ఆయన స్నేహితురాలు పోలీసులకి ఫిర్యాదు చెయ్యటం. దిగ్భ్రాంతికి గురయిన బాధితురాలు తన స్వంత దేశమైన అమెరికాకి వెళ్లి మూడు నెలల తరువాత తిరిగొచ్చి ఫిర్యాదు చేసినప్పుడే విషయం బయటి కొచ్చింది. 2013లో మార్చిన చట్టంలో అనుమతి లేని ఈ లైంగిక చర్యను అత్యాచారంగా నిర్వచించారు. అహంకార పూరిత నమ్మకంతో ఆ స్త్రీ ఇష్టం, అనుమతి లేకుండా చేస్తే దాని పర్యవసానాలు ఆ స్త్రీపై ఎలా వుంటాయో బాధితురాలు ఇలా వర్ణించింది. 'నా శరీరం పై నాకు మాత్రమే పూర్తి అధికారం ఉండాలి. నేను వద్దంటే లైంగిక చర్యకు పాల్పడిన తరువాత, నా శరీరంపై నాకే నియంత్రణ లేకుండా పోయినట్లే కదా. ఇది నేను భరించలేను. నా అనుమతి లేకుండా చేశాడు కాబట్టే, నా కిష్టమైన, గౌరవించే వ్యక్తి అయినప్పటికీ నేను ఫిర్యాదు చేస్తున్నాను' అని ఒక స్నేహితురాలి ద్వారా ప్రపంచానికి తెలియచేసింది. ఇటువంటి అత్యాచారాన్ని ఇతర అత్యాచారాలతో పోల్చి చూడటం కష్టమని కొంతమంది సీనియర్ స్త్రీవాదులు అభిప్రాయపడ్డారు. అతనికి సెషన్స్ కోర్టులో శిక్ష పడినప్పుడు బాధితురాలి వాంగ్మూలం తప్ప ఇతర సాక్ష్యాలు చాలా తక్కువగా ఉన్నాయి కాబట్టి ఆయనకి శిక్ష వెయ్యటం తప్పని మనీషా సేథీ వంటి మానవ

హక్కుల కార్యకర్త వ్యాసం రాశారు. నాతో సహా చాలా మంది దీన్ని నమ్మటం కష్టమని, సరయిన సాక్షాలు లేకుండా అతనికి శిక్ష వెయ్యటం, అతడు ఒక ముస్లిం కాబట్టే జరిగిందని భావించాం. ఇటువంటి శిక్షలు 2013లో వచ్చిన లైంగిక దాడుల చట్టం వల్ల రాజ్యాధిపత్యం తీవ్రతరం అయిందన్న అభిప్రాయాన్ని బలపరుస్తోందని అభిప్రాయపడ్డాం. వీటిలో కొన్నింటికి నేనిప్పటికీ కట్టుబడే వున్నాను కానీ, నా అభిప్రాయాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం నా యువ స్నేహితులు కల్పించారు. వారిలో హైద్రాబాదు ఫర్ ఫెమినిజం ఫేస్బుక్ పేజీ నడిపే తేజస్విని మాడభూషి ఒకరు. ఆమెతో సహా ఆ సందర్భంలో నాకున్న యువ స్నేహితులు అందరు ఫారూఖీని శిక్షించిన ఆ తీర్పుని హర్షించటమే కాక, ఈ రకంగా వద్దంటున్నా వాళ్ళనుకుంటున్న లైంగిక చర్యకి పాల్పడే మగ వాళ్లు చాలా మంది తమకి తెలుసనీ, వారి ప్రవర్తన వల్ల తీవ్రంగా క్షోభ పడ్డ యువతులు అనేక మంది వున్నారని, అటువంటి మగ వాళ్లందరికీ ఇటువంటి తీర్పు ఒక గుణపాఠమని ఫేస్బుక్‌లో రాశారు, అంతే కాదు, నాలా ఆలోచించే పాత తరం స్త్రీవాదులని విమర్శించారు, కోపగించుకున్నారు కూడా. అత్యాచారాలు ఎక్కడో దూరంగా కాక, దగ్గరి వాళ్ళు, ప్రగతిశీల పురుషులు కూడా చేస్తున్నారని ఎత్తి చూపారు.

2017లో తమ దగ్గర పనిచేసిన విద్యార్థినులని లైంగికంగా వేధించిన ప్రగతి శీల ప్రొఫెసర్ల లిస్టు వెలువడటం అకడమిక్ సర్కిల్స్‌లో వుండే నావంటి వారిని ఇంకొక సారి కుదిపేసింది. అమెరికాలో, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న 'మీ టూ' ఉద్యమం సందర్భం లో వెలువడింది లిస్టు. "నేను కూడా లైంగిక వేధింపులకు గురయ్యాను" అని సామాజిక మాధ్యమాల్లో లక్షలాది మంది స్త్రీలు రాసిన సందర్భం అది. మన దేశంలో వచ్చిన లిస్టు బాధితుల పేర్లు లేకుండా వేధించిన అధ్యాపకులు పేర్లు బయట పెట్టింది. దానిలో ఎవరి సిద్ధాంతాలనయితే అందరూ సైట్ చేస్తామో వారి పేర్లు చాలా వున్నాయి. చాలా మంది వామ పక్ష భావజాలంతో పని చేసే వాళ్ళే. వారి పుస్తకాలు, ఆలోచనలు అందరికీ స్ఫూర్తినిచ్చేవే. ఈ లిస్టులో ఎక్కని వాళ్ళు చాలా మందే వున్నారు కానీ, ఇలా బహిరంగంగా పేర్లు చెప్పటం అందరిలో కొంచెం భయమయితే కలిగించింది. కొంత మంది హాస్పటల్లో చేరారని కూడా విన్నాం. వీరిలో కొంతమందిపై ఆ తరువాత వారు పనిచేసే సంస్థల్లో ఫిర్యాదులు కూడా నమోదయ్యాయి. ఆ

తరువాత మన హైద్రాబాదులోనే, నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ న్యూట్రిషన్‌లో ఒక దళిత పరిశోధక విదార్థి ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేసింది. కేరళలో దళిత మహిళా కార్యకర్తలు తమ తోటి ప్రగతిశీల, దళిత ఆక్టివిస్టుల నుండి తాము ఎదుర్కున్న వేధింపుల గురించి బహిరంగంగా రాసారు. ఇప్పుడు మీడియాలో లైంగిక వేధింపులపై చర్చ నడుస్తోంది.

అయితే చట్టం దగ్గరకు, లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీల దగ్గరకు వెళ్లకుండా ఈ రకంగా పేర్లు బయట పెట్టటం ఏ రకంగా సరైందని స్త్రీవాదుల్లోనే కొంతమంది అభ్యంతరం లేవదీశారు. కష్టపడి సాధించుకున్న చట్టాలు, కమిటీలు వదిలేసి, ఈ రకమైన లిస్టులు తయారుచేయటం మనల్ని మనమే ఓడించు కున్నట్లని అభిప్రాయపడ్డారు. కానీ ఇంత కన్నా, ఈ చర్చలో బయటపడిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, అకాడమిక్ వాతావరణంలో అధ్యాపక స్థానంలో వుండి, కొత్త ఆలోచనా ప్రపంచాలని విద్యార్థులకి చూపించ పురుషుల కుండే ఆకర్షణ శక్తి. దీనికి, వారు విద్యార్థుల భవిష్యత్తుని నిర్దేశించే అధికారం తోడయితే ఈ మూడింటి కలయిక విద్యాలయాల్లోనే కాదు, ఎక్కడయినా సమస్యాపూరితమే. విద్యార్థులు మొదటి తరం వాళ్లయితే, మరెంత కష్టం! విద్యార్థినులు తమకి అధ్యాపకులతో శారీరక సంబంధానికి అంగీకారం ఉందని చెప్పినా, ఇష్టమే నని చెప్పినా సరే, అది ఎటువంటి అంగీకారం, ఇష్టం అనే ప్రశ్న వేసుకోవాలి. మన దగ్గర అతి కొద్ది యూనివర్సిటీలోనే లైంగిక వేధింపుల కమిటీలు ఉన్నాయి, వాటిల్లో కూడా కొన్నే పనిచేస్తున్నాయి, వాటిల్లో మంచిగా  పని చేస్తాయని పేరు తెచ్చుకున్న అతి కొద్ది లైంగిక వేధింపుల కమిటీలు కూడా సీనియర్ ప్రొఫెసర్ల దగ్గరి కొచ్చేటప్పటికి చతికిలబడి పోతాయని ఈ చర్చలో బయటి కొచ్చింది. లిస్టుపై చర్చ విద్యార్థులు, అధ్యాపకులు ఎంత దగ్గరగా తిరిగినా, కలిసి పనిచేసినా, వారిద్దరి మధ్య శారీరక సంబంధాలు అధికార సంబంధాలేననీ, అధ్యాపకుల బాధ్యతని ఈ విషయాన్నీ దృష్టిలో పెట్టుకుని పునర్ నిర్వచించాల్సిన అవసరం ఉందని చెప్పింది.

వీటిలో కొత్తేముంది, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, ఎప్పటి నుండో ఉన్నవీ, మనకి  తెలిసినవే కదా అని కొంత మంది అనొచ్చు. కానీ ఇప్పటి వరకు మనమేం చేయగలిగాం? ఆడవాళ్ల మందరం మనలో మనం 'వాడు వెధవ, వీడు చెడ్డోడు జాగ్రత్త' అని ఒకళ్ళ కొకళ్ళు వెనక వెనక చెప్పుకున్నాం.

మగవాళ్లమయితే 'రేయ్, మనోడు చాలా రసికుడు' అనీ, కొంచెం సిద్ధాంతం తెలిసిన వాళ్ళు 'అది ప్రయివేటు విషయం, మనం రాజకీయాల్లో మోరలిస్టిక్‌గా వుండకూడదు' అంటూ సూక్తులు చెప్పుకుంటూ వచ్చాము. ఇప్పటికీ మన ప్రగతిశీల సర్కిల్స్‌లో గానీ, మన సంస్థల్లో గానీ, లైంగిక వేధింపులకు పాల్పడే వాళ్ళని బహిరంగంగా, నిర్ద్వందంగా ఖండించే సంస్కృతి మనం పెంపొందించుకో లేదు. కొంత సమస్యాపూరితమయినా సరే, ఆపకుండా అన్ని వేదికల్లో అరిచి, గగ్గోలు పెట్టి, అది పెంపొందించాల్సిన అవసరం తీసుకొచ్చింది ఇప్పటి యువతరానికి చెందిన స్త్రీలే.

నా ఉద్దేశంలో లైంగికతపై ఇప్పటి చర్చలు 1990లలో జరిగిన చర్చల కంటే భిన్నమైనవి. అప్పటి చర్చలు ముఖ్యంగా స్త్రీల లైంగికతపై కుటుంబ నియంత్రణ, కొంత మేరకు పార్టీ నియంత్రణ గురించి అగ్ర కులాలకు చెందిన, మధ్య తరగతి వివాహిత స్త్రీలు లేవదీసినవి. 1990ల చివర్లో స్త్రీల శరీరాల్ని వస్తువులుగా మారుస్తున్నారనే చర్చ ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో అందాల పోటీలకు వ్యతిరేకంగా వచ్చింది. ఇవి కాకుండా, చాలా వరకు లైంగిక హక్కుల గురించిన చర్చలు రాజ్యం, అగ్ర కులాలు, సైన్యం చేస్తున్న అత్యాచారాల నేపథ్యంలోనే జరుగుతూ వస్తున్నాయి. ఆయా ఉల్లంఘనల్లో స్త్రీల పట్ల సానుభూతి కూడగట్టడం కొంతమేరకు సాధ్యమే కానీ, ఇప్పటి సంఘటనల్లో అటువంటి సానుభూతి అంత తేలిగ్గా కూడగట్టలేము. ఇప్పటి చర్చలు వివాహ వ్యవస్థ బయట స్త్రీలు, పురుషులతో కలిసి తిరిగే, పనిచేసే సందర్భాల్లో – ముఖ్యంగా పని స్థలాల్లో, విశ్వవిద్యాలయాల్లో, లేదా స్నేహ సంబంధాలు, ప్రేమ సంబంధాల నేపథ్యంలో వస్తున్నాయి, స్త్రీలు కూడా తమ స్వేచ్ఛను, స్వాతంత్రాన్ని ఎంతో కొంత ఉపయోగించుకుంటున్న సందర్భాల్లో వస్తున్న వేధింపులు, అత్యాచారాలు, హింస. అంతే కాదు, మారుతున్న సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు ఏ ప్రాతిపదికన వుండాలి అన్న చర్చ జరుగుతున్న సందర్భంలో వస్తున్న హింస ఇది.

కానీ తెలుగులో ప్రధాన స్రవంతిలో ఈ విషయాలపై చర్చ ప్రధానంగా పాత నైతికత ప్రాతిపదికనే కొనసాగుతోందని రెండు సంఘటనల్లో స్పష్టమయింది. 2017 జనవరిలో మన దగ్గర అర్ధరాత్రి ఒక టెలివిజన్ ఛానెల్ విలేఖరి పెద్ద స్థాయిలో వున్న మహిళా పోలీసు అధికారి ఇంట్లోకి, ఆమె భర్త, తల్లితో పాటు

బలవంతంగా ప్రవేశించి ఆమె పడక గదిలోకే కాక, బాత్రూంలోకి కూడా ప్రవేశించాలని ప్రయత్నించాడు. ఎందుకాయన అంత ఉత్సాహ పడిపోయాడు? ఆమెనుండి విడిపోయిన భర్త, ఆమె వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుందని అనుమాన పడి టెలివిజన్ ఛానల్‌కి చెప్తే వాళ్ళు వెంటనే కెమెరా పంపించేశారు. 'బ్రేకింగ్ న్యూస్' అంటూ వేసేసారు. ఆ ఛానెల్‌ని చూసి మరొక పది చానెళ్లు మాకెక్కడ టిఆర్పి పడిపోతుందోనని అవాకులు, చెవాకులు, అబద్ధాలు శాయశక్తులా ప్రసారం చేసేసారు. 'రెడ్ హాండెడ్‌గా పట్టుబడింది' అని హెడ్లైన్స్ పెట్టటంతో ఆమెని, ఆమె స్నేహితుడైన మరొక పోలీసు ఆఫీసర్‌ని సస్పెండ్ చేశారు. ఎవరూ కూడా వ్యక్తిగత విషయంలో మీడియాకి అక్కడ పనేంటి అన్న ప్రశ్న వేసుకోలేదు. ఒంటరిగా వున్న స్త్రీ ఇంటిలోకి బలవంతంగా ప్రవేశించటం వేధింపుల కిందికి రాదా అని మహిళా సంఘాలు అడిగితే కోపం కూడా తెచ్చుకున్నారు. ఎందుకంటే, ఆ నైతిక పోలీసింగ్ తెలుగు మీడియా ఛానెళ్ళకి పదేళ్లుగా అలవాటై పోయింది మరి. దశాబ్దంగా ఒంటరి స్త్రీలని వేటాడి, వేధించి, వాళ్ళని వ్యభిచారులని, తాగుబోతులని బహిరంగంగా అవమానించటం, మహిళల ఫిర్యాదులతో రెండవ భార్యలని, భర్తలని వేటాడి ప్రయివేటు జీవితాల్ని సరుకుగా మార్చుకోవటం - వాటి ద్వారా తమ సామాజిక పెత్తందారీ అధికారాన్ని చానెళ్లు స్థాపించుకున్నాయి.

వాటికి మహిళా సంఘాల వ్యతిరేకత అస్సలు రుచించలేదు. ఆమె తోటి పోలీసు ఆఫీసరు భార్యని గన్ను పెట్టి బెదిరించిందని, ఆమెకి ఆ స్నేహితుడితో అక్రమ సంబంధం ఉందని, మహిళా సంఘాలు అతని భార్యకి మద్దతు నివ్వాలి తప్ప, ఈమెకి ఇవ్వకూడదని ఇలా అనేక రూమర్లు ప్రసారం చేశారు. మహిళా సంఘాలకి బెదిరింపు వాట్సాప్ సందేశాలు పంపించారు. ఆంగ్లంలో వ్యాసం రాసిన ఒక స్త్రీవాదిపై పరువు నష్టం దావా కూడా వేసిందో ఛానెల్. పైగా, తామే మహిళా ఉద్యమాన్ని నడుపుతున్నామని, ఎవరు పట్టించుకోని మహిళా సంఘాలని నిలబెట్టింది తామేనని కూడా ఉద్ఘాటించింది. ఆయా మహిళా సంఘ కార్యకర్తల చీకటి జీవిత కోణాలు బయట పెడతామని బెదిరించింది. ఈ విషయంపై పరిశోధనా పత్రం సమర్పించిన ఒక మహిళా ప్రొఫెసర్‌కి పేరు లేని బెదిరింపులందాయి. ఇంతకీ విచిత్రమేమిటంటే, తెలుగులో ఏ మీడియా సంస్థల్లో కూడా ఏ రకమైన లైంగిక వేధింపుల కమిటీలు లేవు. ఆయా ఛానెళ్ల

ప్రగతిశీలత, నాన్సీ ఫ్రేజర్ చెప్పినట్లు, నయా ఉదారవాద పెట్టుబడి తన మనుగడ కోసం అరువు తెచ్చుకునే ప్రగతిశీలత మాత్రమేనని ఈ సందర్భంలో వారి విశ్వరూపంతో బట్టబయలయింది.

ఇలాగే స్వతంత్రులుగా వ్యవహరించే స్త్రీలపై వేధింపులు, పెత్తనం ద్వారా సామాజిక పెత్తందారీ తనం సంపాదించుకున్న మరో రంగం సినిమా రంగమని అక్కడి స్త్రీల నిరసన ఎత్తి చూపింది. డబ్బు, స్వతంత్రం, గ్లామర్, పేరు వున్న స్త్రీలు తమకి వేధింపులు ఉన్నాయని, న్యాయం జరగట్లేదని గొంతు విప్పితే, మూకుమ్మడిగా బెదిరించి ఆ గొంతులే ప్రజా రంగంలో విన్పించకుండా చేసిన ఘనత మన తెలుగు సినీ పరిశ్రమది. ఆ నిరసన సందర్భంలో సినీ పరిశ్రమ స్పష్టం చేసిందేమిటంటే అక్కడ స్త్రీలు లైంగిక సరుకే కానీ ఆ సరుకు తాము గీసిన గీత దాటి మాట్లాడితే ఏ మాత్రం సహించమని. మహిళలు హీరోల దగ్గరో, డైరెక్టర్ల దగ్గరో, ప్రొడ్యూసర్ల దగ్గరో లైంగిక దాస్యం చెయ్యకపోతే పాత్రలు రావని అర్ధ నగ్నంగా నిరసన వ్యక్తం చేసిన శ్రీరెడ్డి పెద్ద దుమారమే లేపింది. ఆమె వెనక వచ్చిన అనేక మంది డైలాగు ఆర్టిస్టులు కూడా దారుణమైన పని పరిస్థితులు ఉన్నాయని, పై నుండి క్రింద దాకా అందరు పురుషులు తమని లైంగికంగా దోచుకుంటున్నారని వివరాలు, కొన్ని పేర్లతో సహా బయట పెట్టారు. శ్రీరెడ్డితో సహా ఎవరూ కూడా తాము ఒకరితో మాత్రమే సంబంధం కలిగున్న వారమని అనలేదు. తమ శరీరాలు లైంగిక వస్తువులుగా తెరపై చూపటానికి వారికి పెద్ద అభ్యంతరం లేదు. తమ శరీరాలు ప్రేక్షకులని ఎలా కదిలిస్తాయో తెలుసని శ్రీరెడ్డి స్పష్టంగానే మాట్లాడింది. వాళ్ళన్నది ఒకటే, లైంగిక లొంగుబాటు పని దొరకటానికి షరతు కాకూడదని. అంతే, పరిశ్రమ మొత్తం ఒకే తాటిపై నిలబడి, టెలివిజన్ ఛానెళ్ళని, వార్తా పత్రికలని బెదిరించి వాళ్ళ గొంతులు వినపడకుండా చేసింది. సామాజిక పితృస్వామ్యాన్ని బలంగా నిలబెట్టింది.

మీరనొచ్చు ఇవి ఎప్పటినుండో వున్నాయి, దీంతో కొత్తగా చర్చించు కునేదేముంది అని. కాస్టింగ్ కౌచ్ ఎప్పటినుండో వుంది అనేది ఒప్పు కోవాల్సిందే. సినిమా రంగం నుండి మాట్లాడిన స్త్రీలలో ఎంతో కొంత ప్రజా మద్దతు దొరకటం కొత్త విషయాలే. అంతే కాదు, సినిమా రంగం స్త్రీలలో ఎవరూ కూడా నగరాల నుండి వచ్చిన వాళ్ళు కాదు. రాజకీయాలలో వాళ్లకి పెద్దగా ఆసక్తి కూడా

లేదు. వీళ్ళు ఎవరు స్త్రీవాదులమని చెప్పుకోలేదు. ఎవరూ కూడా పట్టణ ప్రాంతం నుండి వచ్చి, కుల నిచ్చెనలో అన్ని మెట్ల నుండి వచ్చి, పెద్దగా చదువు లేని వాళ్ళు, చిన్నప్పుడే వివిధ కారణాల వల్ల చదువుకి దూరమయ్యి, పెళ్ళిళ్లు అయిపోయి, కుటుంబాల నుండి విడిపోయిన వాళ్ళు. పని చేసే చోట హింసకి గురవ్వదలచుకోలేదని, అవమానకర పరిస్థితుల్లో, అన్యాయానికి గురవుతూ బ్రతకదలుచుకోలేదని చెప్పారు. సినిమా పరిశ్రమలో వ్యక్తులుగా గౌరవంతో బ్రతకటం ఎందుకు సాధ్యం కాదని అడిగారు.

వ్యక్తిగత స్వేచ్ఛని వ్యక్తీకరిస్తున్న క్రమంలో హింసాత్మకమవుతున్న మరొక సాంఘిక పరిణామం, కులాంతర, మతాంతర వివాహాలు. వీటిని ఇది వరకు ప్రగతిశీల సంఘాలు సంస్థలు ప్రోత్సహించి, ఒక కార్యక్రమంగా చేసేవి గానీ, గత దశాబ్ద కాలంగా జరిగినవన్నీ దాదాపు వ్యక్తుల మధ్య ప్రేమతో జరిగినవే. వీరిలో ఎవరికీ కులాన్ని నిర్మూలించాలనే విశాల లక్ష్యాలు పెద్దగా ఏమీ లేవు. నిచ్చెన మెట్లలో పైనున్న వాళ్ళు విరుచుకు పడి ఆయా దళిత (ఇతర వెనుకబడిన కులాల) అల్లుళ్ళని, స్వంత కూతుళ్ళని పొట్టన పెట్టుకున్నప్పుడు కూడా ఆయా యువతీ, యువకులు అడిగేది – తమకి ఈ పెద్ద పెద్ద సామాజిక శక్తులతో సంబంధం లేదని, తమ వ్యక్తిగత ఆకాంక్షల్ని గౌరవించమని. కుల హత్యలో భర్తని కోల్పోయిన ప్రణయ్ భార్య అమృత వర్షిణి కూడా అదే చెప్పింది. తెలంగాణ ఏర్పడిన నాలుగేళ్లలో దాదాపు 35కు పైగా ఇటువంటి దాడులు, హత్యలు జరిగాయంటే, ప్రబలుతున్న కులాంతర వివాహాలని, వాటినాపాలని విశ్వ ప్రయత్నం చేస్తున్న ఈ హింస తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ప్రధాన స్రవంతి చర్చలో గానీ, పాపులర్ కల్చర్‌లో గానీ, ఇంకా చెప్పాలంటే, ఉద్యమ సంస్కృతిలో కూడా సాధారణంగా వీటిని అడిగే వాళ్ళు, అడగగలిగే వాళ్ళు మగవాళ్లే. మన సినిమాల హీరోలందరూ వ్యవస్థపై కోపగ్రస్తులైన మగవాళ్లే. జనసమ్మత సంస్కృతి (పాపులర్ కల్చర్) లేదా ప్రజా సంస్కృతిలో క్రియాశీలురైన ఆడవాళ్ళని కొన్ని నమూనాల్లో అర్థం చేసుకుంటూ వచ్చాము: కుటుంబంలో స్థానం కోసం పోరాడే వాళ్ళు లేదా కుటుంబం, గ్రామం, కులంపై వ్యవస్థీకృత అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడేవాళ్ళు, ఇంకా చెప్పాలంటే, వ్యవస్థపైనే పోరాడే వాళ్లు. కానీ ఇప్పటివరకు మనం చూసిన సంఘటనలోని వివిధ రకాల స్త్రీలు,

వారికి మద్దతు తెలుపుతున్న పురుషులు మాత్రం మా వ్యక్తిగత స్వేచ్ఛకి, కులం, పితృస్వామ్యంతో సహా ఎవరూ అడ్డు రాకూడదని ఆశిస్తున్నారు. వ్యక్తిగత స్వేచ్ఛ కోసం జెండర్, కులంతో సహా సమాజం పెట్టిన అడ్డంకుల్ని ఎదుర్కోవటానికి సిద్ధ పడుతున్నారు.

అసలీ వ్యక్తిగత స్వేచ్ఛ, వ్యక్తిగతం ఎక్కడివి? ఇక్కడే మనం ఆయా స్త్రీలు, పురుషులు ఏ వ్యవస్తీకృత మార్పుల నుండి వస్తున్నారనే ప్రశ్న వేసుకోవాలి. భారత దేశం నిరంతరాయంగా అన్ని రంగాల్లో అమలు చేసిన నయా ఉదారవాద విధానాలు, అవి తెచ్చిన మార్పుల నుండే వ్యక్తిగత స్వేచ్ఛని ఈ రకంగా వ్యక్తీకరించే యువతీ, యువకులు వస్తున్నారని నా ప్రతిపాదన. ఆయా విధానాల వల్ల జరిగిన విధ్వంసం గురించి, అవి తెస్తున్న కొత్త వైరుధ్యాల గురించి అందరికీ తెలిసిందే. అయితే ఈ విధ్వంసం నేపథ్యంలోనే జెండర్, లైంగిక సంబంధాలు కూడా పునర్వ్యవస్తీకరింప బడుతున్నాయని, శరీరం, లైంగికతల గురించి పాత పెత్తందారీ భావజాలాలు మారుతున్నాయని గుర్తించాలి. ఇప్పుడు ఆయా మార్పులని కొంచెం వివరంగా చర్చించుకుందాం.

నయా ఉదారవాదం తెచ్చిన వ్యవస్థీకృత మార్పుల్లో..

**మొదటిది : ప్రయివేటీకరణ వల్ల జరిగిన ప్రజల విస్థాపన:**
**ఆ విస్థాపన, విధ్వంసం మధ్యలో రూపుదిద్దుకుంటున్న వ్యక్తిగతం, వ్యక్తులు**

1990 తరువాత వేగవంతమయిన ప్రయివేటీకరణ, ఉదారవాద విధానాలు, ప్రయివేటు కార్పొరేట్ సంస్థల ద్వారా భారత రాజ్యం చేపట్టిన ఆర్థిక విధానాల వల్ల 'స్వేచ్ఛా శ్రామికులు' పెద్ద సంఖ్యలో ఉత్పన్నం అయ్యారు. మార్క్స్ చెప్పిన అర్ధంలో లక్షల మంది బలవంతంగా, హింసాత్మకంగా తమ తమ గ్రామాలు, తండాలు, అడవుల నుండి విస్థాపన చెందారు. పట్టణ ప్రాంతాలకు, దూర ప్రదేశాలకు ఏ రక్షణ లేని పని వెతుక్కుంటూ వలస పోతున్నారు. భారత రాజ్యం తాను తక్కువలో తక్కువగా ఇచ్చిన 'సాంఘిక సంక్షేమం' కూడా వెనక్కి తీసుకోవటంతో ఏ రకమైన సామాజిక, ఆర్థిక పౌరసత్వం లేని భారతీయ పౌరులు అనేక మంది తయారయ్యారని నీర్జా గోపాల్ జయాల్ వంటి రాజనీతి శాస్త్రవేత్త ఎత్తి చూపారు. అంతే కాక, వీరు వలస వచ్చినవారి పట్ల ఏ మాత్రం దయ లేని

నగర వాతావరణంలో వుంటున్నారని కూడా అంటారు. భారత దేశంలో ఇలా వలస వెళ్తున్న ప్రజలు ప్రస్తుతం 7 కోట్ల నుండి 10 కోట్ల వరకు ఉంటారని పరిశోధకులు అంచనా వేశారు. పని కోసం వలస వెళ్తున్న ఇటువంటి శ్రామికుల్లో 80% మంది మగవాళ్లే. అయితే ఏ రక్షణ, హక్కులు లేని ఈ 'వలస పౌరులు' కుటుంబం, గ్రామం, కులం కట్టుబాట్ల నుండి కూడా విడదీయబడ్డారని మనం గుర్తించాలి. వాళ్లే రోజు మనకి కనిపించే హొటల్ వర్కర్లు, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, హాస్పిటల్ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, సెక్స్ వర్కర్లు. స్వాతంత్ర్యానంతర చరిత్రలో ఇంత మంది తమ స్వంత ప్రాంతాల నుండి విడదీయబడి, బలవంతంగా తమ బ్రతుకు తాము బ్రతకాల్సిన సందర్భం ఇప్పుడే ఏర్పడిందని సామాజిక శాస్త్రవేత్త చిన్మయి తుంబే అంటారు. అయితే, ఇవే ఉదారవాద విధానాల విధ్వంసం నేపథ్యంలోనే వీరికి తమ జీవితాల్ని తాము నిర్మించుకునే 'స్వేచ్ఛ' కూడా వారికి ఇవ్వబడింది లేదా లభించిందని బహుశా మనం గుర్తించాల్సిన సమయం వచ్చింది.

**రెండవది : పెరుగుతున్న ఉన్నత విద్య నేపథ్యంలో జెండర్ సంబంధాలు, లైంగికతల మార్పు:**

1990 తరువాత, జనాభాలోని ఇంకొక పొర ఇష్టంతో వలస వెళ్ళటం ప్రారంభించింది. వాళ్ళు విద్యార్థులు. వేరే ప్రాంతాలకి, పట్టణాలకు, నగరాలకు వెళ్లి ప్రభుత్వ విద్యాలయాల్లో లేక ప్రయివేటు విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య చాలా, చాలా పెరిగింది. ముఖ్యంగా ఉన్నత విద్య, అంటే ఇంటర్మీడియట్ నుండి పై స్థాయి వరకు చాలా పెరిగింది. ప్రభుత్వం కంటే ప్రయివేటు సెక్టర్ లోనే వున్నత విద్య విపరీతంగా పెరిగిందని అధ్యయనాలు చెప్తున్నాయి. మొత్తానికి ఇటువంటి విద్యార్థుల సంఖ్య ఒక కోటి వరకు ఉంటుందని ఒక అంచనా. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆడపిల్లలు స్కూలు కెళ్ళటం కూడా గత దశాబ్ద కాలంగా దేశ వ్యాప్తంగా పెరిగింది. ఇది అన్ని స్థాయిల్లో కూడా పెరిగింది, అన్ని సామాజిక వర్గాల్లో కూడా పెరిగింది. ఉన్నత విద్యలో (అంటే, ఇంటర్మీడియట్ తరువాత) అమ్మాయిల సంఖ్య అబ్బాయిల సంఖ్యతో, అన్ని వర్గాల్లో, దాదాపు సరి సమానంగా వుంది. అంతే కాదు, ఎంతగా పెరిగిందంటే ఆర్థిక వేత్తలు దీన్ని 2004 తరువాత మార్కెట్లో స్త్రీ శ్రామికుల పనిలో పాల్గొనే

రేట్ తగ్గటానికి ఒక కారణంగా గుర్తించేటంత పెరిగింది.

మనం ఇప్పటి విద్యా విధానాన్ని ఎంత విమర్శించినప్పటికీ, ఒక విషయం గుర్తించక తప్పదు. అణువణువునా కుల అహంకారం, స్త్రీ ద్వేషంతో కూడిన ఈ సమాజంలో వున్నత స్థాయి విద్యాలయాల్లో, ముఖ్యంగా పబ్లిక్ (అంటే, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే) విశ్వవిద్యాలయాల్లో అన్ని రకాల సామాజిక వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు, విద్యార్థినులు సమానులుగా కలుస్తున్నారు అని. మన సమాజంలో ఇది ఊహించని విప్లవాత్మక మార్పు. దీనితో సమానత్వం వచ్చేసిందని చెప్పలేము కానీ అనుక్షణం కుటుంబం, గ్రామం, సమూహం కనుసన్నల్లో, కట్టుబాట్లలో మెలగనవసరం లేని ఒక ప్రదేశం/స్పేస్ ఈ విద్యాలయాల వల్ల ఏర్పడిందని గుర్తిద్దాం. కులం, స్త్రీ ద్వేషం ఒక్క రోజులో పోయేవి కాదు. కానీ, మొదటి తరం దళిత విద్యార్థులు, ఆదివాసీ విద్యార్థినులు, సవర్ణ విద్యార్థులు ఒకరినొకరు చూసి, కలిసి ఒక తరగతి గదిలో కూర్చోవాల్సి రావటం తప్పనిసరిగా ఒకరి గురించి మరొకరు తెలుసు కోవటానికి, బయటి సమాజం కల్పించని అవకాశాల్ని కల్పిస్తోంది, కొంతమేరకైనా వీరి మధ్య ఇంటరాక్షన్ ఒకరి గురించి ఒకరికున్న మూస పోసిన ఆలోచనల్ని మార్చటానికి ఉపయోగ పడుతోంది. మన పబ్లిక్ విశ్వవిద్యాలయాల్లో కుల అహంకారానికి, జెండర్ అసమానత్వానికి వ్యతిరేకమైన నిరసనలు ఎక్కువ కావటం బహుశా కాకతాళీయం కాదు. రోహిత్ వేముల నిరసన కావచ్చు, బెనారస్ హిందూ యూనివర్సిటీ అమ్మాయిలు కావచ్చు, ఢిల్లీ కాలేజీల్లో పింజ్రా తోడ్ కావచ్చు, కేరళ, తమిళనాడులో కాలేజీ అమ్మాయిల కిస్ ఆఫ్ లవ్ నిరసనలు కావచ్చు, ఇవన్నీ జరుగుతున్న విప్లవాత్మక మార్పుకి నిదర్శనాలు.

ఇటువంటి రాజకీయార్థిక, సామాజిక పరిణామాలే బహుశా మన దేశ చరిత్రలో మొదటిసారిగా పెద్ద స్థాయిలో వైయక్తికం, వ్యక్తులు, వ్యక్తిగతాలు ఏర్పడటానికి భూమిక ఏర్పరుస్తున్నాయి. ఉదారవాద వైయక్తికం, వ్యక్తులు, వ్యక్తిగతాలు ఐరోపా చరిత్రలో కూడా గ్రామాలని, సమూహ జీవనాన్ని విధ్వంసం చేసి మనుషులని వారి వారి సమూహాల నుండి, గ్రామాల నుండి బలవంతంగా విడగొట్టి, తమ కాళ్ళ మీద తమని నిలబడేలా చేసిన పెట్టుబడి వల్లే నని, రాజనీతి శాస్త్రవేత్త ఆదిత్య నిగమ్ ఎత్తి చూపారు. ఆ రకంగా తమ సముదాయాల

నుండి విడగొట్టబడిన మనుషులని వ్యక్తులుగా తయారుచేసేది ఎవరు? ప్రధానంగా పెట్టుబడి సృష్టించిన మార్కెట్. ఎట్లా? వారిని వినియోగ దారులుగా రూపు దిద్ది, మార్చి. జెండర్ పరంగా, కుల పరంగా, వర్గ పరంగా వారిని రక రకాల వినియోగదారులుగా తయారుచేస్తుంది. ప్రపంచాన్ని, వస్తువుల్ని వినియోగించటంలో ఎంపికనిచ్చి ఆ ఎంపిక బట్టి ఏ రకమైన వ్యక్తివో నిన్నునువ్వు నిర్వచించుకునే మార్గాన్ని ఏర్పరుస్తుంది. భారత దేశంలో గత రెండున్నర దశాబ్దాలలో మార్కెట్ తీసుకొచ్చిన/కూడిన ఎంపికలు ఎన్నో. మాల్స్ నుండి ఫేస్బుక్ వరకు దీనికి దారులు వేసేవే. ఇదేదో చెడ్డ, జరకూడని, విపరీత పరిణామమని నేను అనుకోవట్లేదు. దీన్ని ఒక తప్పనిసరి చారిత్రిక పరిణామంగా అర్థం చేసుకోవటం అవసరం.

కొత్తగా స్వేచ్ఛా జీవులవుతున్న వారిని సంభాళించటానికి 1990ల తరువాత వ్యక్తివాదం ఒక ప్రధాన స్రవంతి భావజాలంగా ముందు కొచ్చింది. దాని ఆరాధన పెరిగింది. వార్తా పత్రికల్లో, మార్కెట్‌లో 'సెల్ఫ్ హెల్ప్ 'పుస్తకాలు వెల్లువలా వచ్చాయి. అత్యవసరమయిన ఇంగ్లీష్‌తో పాటు లైఫ్ స్కిల్స్ కూడా నేర్పే సంస్థలొచ్చాయి. వ్యక్తివాదం ప్రధానంగా చెప్పేదేమిటంటే, "ఇది పోటీ ప్రపంచం, ప్రపంచంలో నువ్వు సఫలీకృతుడివి కావటానికి నువ్వు మాత్రమే కారకుడివి/ కారకురాలివి. పోటీ ప్రపంచంలో నువ్వు ముందుకెళ్లాలంటే నీ మీదే నువ్వు ఆధార పడాలి తప్ప వ్యవస్థ మీద కాదు, రాజ్యం మీద కాదు. స్వావలంబన నేర్చుకో, అంతే కానీ వ్యవస్థని నిందించకు. వ్యవస్థ నిన్ను భరిస్తోంది. నీ సాఫల్యం దాని కనుగుణంగా నిన్ను నువ్వు మార్చుకోవటంలోనే వుంది". 1990ల తరువాతి తరం ఈ భావజాలం లోకే ప్రవేశించారు. ఇక్కడ వ్యవస్థ వైఫల్యాలు వుండవు, వ్యక్తిగత వైఫల్యాలే ఉంటాయి తప్ప. ఎకనామిక్ టైమ్స్/ బిజినెస్ లైన్ అంచనా ప్రకారం గత పదేళ్లలో 75,000 మంది విద్యార్థులు ఆత్మ హత్య చేసుకున్నారంటే, ఈ భావజాల సఫలతని అంచనా వెయ్యచ్చు.

**మూడవది : 2000లలో పెరుగుతూ వచ్చిన ప్రభుత్వ స్త్రీ వాదం, ప్రజామోద స్త్రీ వాదాలు:**

భారత రాజ్యం 1990ల తరువాత 'స్త్రీల సాధికారత' సిద్ధాంతాన్ని తన సాధికారత కోసం వినియోగించుకోవటం మొదలుపెట్టింది, ఇది కొంత మేరకు

స్త్రీల ఉద్యమ ఫలితమే కావచ్చు. అప్పుడొక విధానం, తరువాత మరొక విధానాన్ని ప్రవేశ పెడుతూ పోతోంది. ఒక సారి హింసని ఆపుతాను అంటుంది, మరొక సారి గ్యాస్ సిలిండెర్లు ఇస్తాను అంటుంది, ఇంకో సారి పొదుపు పథకం అంటుంది, లేదా కల్యాణ లక్ష్మి అంటుంది. మరొకసారి కూతుళ్ళని చదివిద్దాం, కూతుళ్ళని పెంచుదాం అంటుంది. పెద్ద ఉద్యమం వస్తే, స్త్రీలపై హింస గురించిన చట్టాల్ని మరింత కఠినతరం చేస్తుంది. మరొకసారి ముస్లిం స్త్రీలని ఉద్ధరిస్తా నంటుంది. మరోసారి జెండర్ సెన్సిటైజేషన్ కోర్సులని తప్పనిసరి చేస్తుంది. మాలాంటి వాళ్ళతో పాఠ్య పుస్తకాలు కూడా రాయిస్తుంది. చేసేది కొంచెమైనా ప్రజారంగంలో మాత్రం స్త్రీల సాధికారతని చర్చలో ఉంచుతుంది.

దీనితో పాటు ఒక రకమైన ప్రజామోద (పాపులర్) స్త్రీ వాదం కూడా ఈ మధ్య పెరిగింది. వాషింగ్ మెషిన్ ప్రకటనల్లో కావచ్చు, వోగ్ పత్రికలూ వంటి అంతర్జాతీయ పత్రికల్లో తెచ్చిన 'ఛాయస్ ఫెమినిజం' (నాకిష్టమైనది నేను చేస్తాను అన్న స్త్రీ వాదం) కావచ్చు ఇలా స్త్రీలకి తమ స్వతంత్రం, స్వేచ్ఛ వుండాలని గత కొన్నేళ్లుగా వస్తున్న ఈ ప్రజామోద స్త్రీ వాదం చెపుతుంది. మగవాళ్ళు దీన్ని ఆమోదించాలని కూడా చెప్తుంది. ఏది ఆమోదకరమైన స్త్రీల స్వతంత్రం అన్నది అంతర్జాలంలో ఇప్పుడు ఒక పెద్ద చర్చా విషయం.

ఇక్కడ గుర్తించాల్సింది ఏమిటంటే, మా తరం స్త్రీలు పెరిగి పెద్దవుతున్న రోజుల్లో లేని స్త్రీ వాదం గాలి ఇప్పుడు వీస్తోంది. అప్పుడు స్త్రీ వాదం అంటే ఒక రాడికల్ నినాదం, భావ జాలం, సమాజాన్ని కూలగొట్టే సిద్ధాంతం. ఇప్పుడు దాన్ని కొంతమేరకు రాజ్యం, మార్కెట్ తమ అవసరాల కనుగుణంగా మలుచుకున్నాయి. గర్ల్ పవర్, ఫెమినిజం స్లోగన్లు రాసి వున్న టి షర్టులు చాలా చోట్ల దొరుకుతున్నాయి. బహుశా అమెరికన్ తత్వవేత్త నాన్సీ ఫ్రేజర్ చెప్పిన నయా ఉదారవాద ప్రగతి శీలతలో ఇది కూడా భాగమేమో. ఏదయితేనేం, రాజ్యం, మార్కెట్ రెండూ కూడా, స్త్రీలకి సమాజంలో 'సహజ సిద్ధమయిన పాత్ర' ఉంటుందని ఒక పక్క చెప్తూనే, మరో పక్క స్త్రీలని 'తమకి కావాల్సింది ఎంచుకోగలిగే వ్యక్తులుగా' కూడా రూపొందించటానికి ప్రయత్నిస్తున్నాయి. 'చక్కగా అమ్మాయిలా వుండు' అని చెప్తూనే, 'ఎప్పుడూ అమ్మాయిలా ఎందుకు ప్రవర్తిస్తావు?'

అని కూడా అడుగుతున్నాయి. ఈ స్త్రీల సాధికారత వాదన పురుషులని కూడా ఎంతో కొంత మారమని చెప్తుంది, కానీ దాని దృష్టి కేంద్రీకరించేది మాత్రం స్త్రీల మీదే, పురుషులపై కాదు.

**నాల్గవది : వ్యక్తిగత సంతోషానికి, ఆనందానికి ప్రాధాన్యమివ్వమంటున్న సోషల్ మీడియా, అంతర్జాలం తెచ్చిన సమాచార విప్లవం**

టెలివిజన్ ద్వారా నడిచే సాంస్కృతిక పరిశ్రమ చాలా వరకు పాత నైతిక భావజాలంతో పనిచేస్తోంది కానీ, అంతర్జాలం, సోషల్ మీడియా యువకులు, యువతులకి తమ శరీరాలని, తమ జీవితాలని ఎలా మలుచు కోవాలో, నియంత్రించుకోవాలో చెప్తూ దానికి కావాల్సిన వివరాలు, పద్ధతులు, దృక్పథం సరఫరా చేస్తోంది. టెలివిజన్ సీరియళ్లల్లో మూసపోసిన మంచి స్త్రీలు, చెడ్డ స్త్రీలు వుంటారు. న్యూస్ మీడియాలో స్త్రీలు సెలబ్రిటీస్‌గా వుంటారు – సినీ తారలు, బ్యాంకర్లు, పారిశ్రామిక వేత్తలు, అటువంటి అరుదయిన స్త్రీలు. కానీ అంతర్జాలం, సామాజిక మాధ్యమాల్లో అన్ని రకాల వాళ్ళు వుంటారు. లైంగిక చర్యల గురించి అన్ని రకాల సమాచారమే కాక, పోర్నోగ్రఫీ కూడా ఇంటర్నెట్ కనెక్టివిటీ పెరగటం వల్ల బాగా అందుబాటులోకొచ్చింది. దీని వల్ల ఒక పక్క శరీరం అంటేనే – పురుషులు కావచ్చు, స్త్రీలు కావచ్చు, లైంగిక పరికరంగా భావించే భావజాలం పెరిగింది, అందానికి విపరీతమైన ప్రాముఖ్యత పెరిగింది. ఇదివరకుతో పోలిస్తే తమ వ్యక్తిగత సంతోషానికి, ఆనందానికి అన్నింటికన్నా ఎక్కువ ప్రాముఖ్యత నివ్వటం సరయినదే అన్న భావన కూడా ఊపందుకుంది.

వ్యక్తివాద భావజాలాన్ని పెంపొందించే అంశాలు ఈ నాలుగే కావు, కానీ మన చర్చకి ఇవి చాలు. ఒక పక్క ఉదారవాద విధానాలు మనుషుల్ని తమకి అలవాటయిన స్థానాల నుండి ఊడబీకి కొత్త ప్రాంతాల్లో జీవితాల్ని ఏర్పర్చుకోమని చెప్తున్నాయి. సామాజిక అంతరాలకి భిన్నంగా స్త్రీ పురుషులు పరిచయాల్ని చేసుకునేందుకు ప్రేరేపిస్తున్నాయి, అవకాశాలు కల్పిస్తున్నాయి. కానీ ఇవి చేసుకోవటానికి అవసరమైన మానసిక, శారీరక, ఆర్థిక వనరులు చాలా మందికి లేవు. ఆసక్తి, ఉత్సాహం ఉన్నప్పటికీ, ఆయా సంబంధాలకి, స్నేహాలకి రెడీమేడ్ నమూనాలు లేవు. సమాచారం వుంది కానీ, భావోద్వేగాలని సంభాళించే జ్ఞానం లేదు. మన ముందున్న ప్రపంచం అందుకే వైరుధ్య భరితంగా మారిపోయింది.

భారత దేశంలో జరుగుతున్న లైంగిక విప్లవం ఈ వైరుధ్యాలలోనే చిక్కుకు పోయింది. అన్ని విప్లవాల్లాగే ఇది కూడా హింసాభరిత మయింది. పిల్లల్ని లైంగిక వాంఛలకు వాడుకోవటం, కులాంతర వివాహాల్లో దళిత పురుషుల్ని చంపెయ్యటం, ఖాప్ పంచాయతీలు, సామూహిక అత్యా చారాలు, స్త్రీలపై పెరిగే లైంగిక దోపిడీ, వ్యక్తి స్వాతంత్రం కులం, జెండర్, వర్గ వైరుధ్యాల మధ్యలో వస్తే జరిగే పరిణామాలే. కానీ, ఇదే వ్యక్తిగత స్వేచ్ఛ భావజాలం ఏ ఉద్యమ మద్దతు లేని స్త్రీలు (పురుషులు కూడా అనుకోండి) తమ కోసం, తమ స్వతంత్రం కోసం, తమ సంతోషం కోసం, గౌరవం కోసం నిలబడే అవకాశాలు కూడా కల్పిస్తోంది. అవి తమకు నచ్చిన భాగస్వామిని వెతుక్కోవటం కావచ్చు, పని స్థలాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిరసనలు కావచ్చు, మగ స్నేహితులతో కలిసి చెట్టపట్టాలు వేసుకుని తిరిగే స్వతంత్రం కావచ్చు, రోడ్డు పైన, పార్కుల్లోనూ పని లేకుండా వుత్తగా తిరిగే స్వేచ్ఛ కావచ్చు, ముఖ్యంగా లైంగిక సంబంధాల్లో అంగీకారం ఉండాలని డిమాండ్ చెయ్యటం కావచ్చు.

స్త్రీల ఉద్యమం, దళిత ఉద్యమాలు, మిగిలిన హక్కుల ఉద్యమాలు లైంగిక హక్కుల కోసం పని చెయ్యలేదా అని అడగొచ్చు. ఎందుకు చెయ్యలేదు, తప్పకుండా చేశాయి. మనం హింస జరిగినప్పుడు, కుటుంబం, పోలీసులు, ఆధిపత్య శక్తులు హక్కుల ఉల్లంఘనలకి పాల్పడినప్పుడు పోరాడాము. న్యాయం కోసం ఉద్యమిస్తాం. రక్షణ కావాలని అడుగుతాం. దుర్మార్గమైన రోమియో స్వాడ్లు, లవ్ జిహాద్ ప్రోగ్రాములు జరిగినప్పుడు వారికి అండగా నిలబడుతున్నాం. కులాంతర వివాహం చేసుకున్న జంటలకి మద్దతిస్తున్నాం. కాలేజీ అమ్మాయిలు కర్ఫ్యూ వద్దంటే మద్దతిస్తాం. చిన్న పిల్లలపై హింసని ఖండించాం. చట్టాల్లో మార్పులకి పోరాడాం. కానీ ఇవన్నీ సంఘటనల తరువాతి మన స్పందనలే. కానీ, ఇది వరకులా కాకుండా యువతీ యువకులు, సంస్థల మద్దతు కోసం చూడకుండా, తమంతట తామే, తమనిలా వేధించారని ముఖ పుస్తకంలో పెట్టి మద్దతు ఎలా కూడగట్టుకుంటున్నారు? పిల్లలపై లైంగిక అత్యాచారాలు జరిగితే తల్లి తండ్రులు దాచి పెట్టుకోకుండా ఆస్పత్రులకి, పోలీస్ స్టేషన్లకి ఎట్లా వెళ్లగలుగుతున్నారు? శ్రీ రెడ్డి వంటి స్త్రీలు పదేళ్ల క్రితం మాట్లాడి ఉంటే సోదిలోకి లేకుండా తరిమి కొట్టే వాళ్ళు కాదా? ఇలా మాట్లాడే స్త్రీలలో చాలామందికి కులపరమైన, వర్గ

పరమైన ఆధిక్యత ఉందనేది వాస్తవం. కానీ గుర్తించాల్సింది, ఇటువంటి స్త్రీలు కూడా కొన్నాళ్ల క్రితం ఈ విషయాలు మాట్లాడలేక పోయారని. మాట్లాడినా లైంగిక స్వతంత్రత విషయాల్లో ఇంత ధిక్కార స్వరం ఉపయోగించలేకపోయారని.

మన దేశంలో లైంగిక హక్కులకోసం బహిరంగంగా పోరాడింది ప్రధానంగా లైంగిక అల్పసంఖ్యాకులైన గే, లెస్బియన్ ఉద్యమాలు, ట్రాన్స్‌జెండర్ ఉద్యమాలే. తమ ఉనికి, అస్తిత్వం, తమపైన వుండే నేర ముద్ర తొలగిపోవాలని, తమకి జీవితాన్ని ఆనందించే స్వేచ్ఛ కావాలని ఇరవై సంవత్సరాలు వాళ్ళు చేసిన పోరాటాలు అధికారిక జెండర్, లైంగికత నమూనాల మూలాల్ని కదిలించాయి. వారి పోరాటాలు దేశంలో జరుగుతున్న ఇతర మార్పులతో కలిసి లైంగికత పట్ల యువత వైఖరిని మార్చటంలో తోడ్పడుతున్నాయి. లైంగికానందం ప్రతి ఒక్కరికీ అవసరమేనని, అది అంగీకారంతో జరగాలనే స్పృహని కొంతలో కొంత పెంచుతున్నాయి. ఈ మార్పుల వల్ల వచ్చిన స్పేస్ శ్రీరెడ్డికి మద్దతు నిచ్చింది. అమృతవర్షిణికి మద్దతు కూడగట్టింది. ఇదివరకటిలా వివాహానికి ముందు సెక్స్‌ని పెద్ద అపరాధంగా చూడటం కొంత తగ్గింది. స్టాండ్‌అప్ కమెడియన్లు స్వయంతృప్తి గురించి, పోర్నోగ్రఫీ గురించి, మన సమాజం శిలా సదృశంగా భావించే భారతీయ పురుషత్వం గురించి, స్త్రీత్వం గురించే కాక, మార్కెట్ పెంపొందించే కొత్త స్త్రీత్వ నమూనాల గురించి కూడా జోకులు వేస్తున్నారు.

హక్కుల కార్యకర్తలుగా మనం చెయ్యగలిగింది, జరుగుతున్న మార్పుని గుర్తించి, ఆహ్వానించటం. ఆ హక్కు నయాఉదారవాద నేపథ్యంలో వచ్చింది కాబట్టి పక్కన పడెయ్యలేము. ఆహ్వానించినంత మాత్రాన విమర్శించ కూడదనీ లేదు. అందాల పరిశ్రమ, ఎక్కువయిన శరీర స్పృహ యువతులని, యువకులని కొత్త కట్టుబాట్లలోకి నెడుతోంది. పోర్నోగ్రఫీ భర్తలకు భార్యల్ని వేధించటానికి కొత్త ఆయుధంగా పరిణమించింది. ఆన్‌లైన్ ట్రోలింగ్ సామాజిక పితృస్వామ్యానికి కొత్త రూపానిచ్చింది. అంతే కాదు, చిన్న ఇల్లు, పేదరికం, కుల పెత్తనం బలంగా కొనసాగే మన సమాజంలో, స్వంత ఆనందానికి ప్రాధాన్య మివ్వడం ఎన్ని వైరుధ్యాలకి, హింసకి దారి తీస్తుందో సామాజిక స్పృహ వున్న ఎవరికైనా సులభంగా అర్థమవుతుంది.

లైంగిక హింస, వేధింపుల గురించి మరింత సంక్లిష్ట ప్రశ్నలు వేసుకోవాల్సిన

అవసరం కూడా ఈ వైరుధ్యాలే కల్పిస్తున్నాయి. వాటిలో మొదటిది, ఇన్ని రకాల సంక్లిష్ట సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పుల నేపథ్యంలో లైంగికత, లైంగిక స్వేచ్ఛ, లైంగిక వేధింపులు, లైంగిక హింసల పట్ల సమాజంలో ఇప్పటికీ బలంగా వున్న భిన్న అవగాహనలని మార్చటం ఎలా అన్నది. ఈ భిన్న ఆవగాహనలు చాలా వరకు సమస్య పూరితమైనవి. చట్టాలు కొత్తగా రూపొందుతున్న లైంగిక హక్కుల అవగాహనని పరిగణిస్తున్నాయి, వాటికనుగుణంగా కొంత మారుతున్నాయి. కానీ, సమాజంలో ఇప్పటికే వున్న భిన్న అవగాహనలతో పని చెయ్యటం, వాటిని మార్చటం ఎలా అన్న ప్రశ్నకి సమాధానం ఇవ్వలేవు. మరి మనం వున్న అపోహలు, అభిప్రాయ భేదాలు, తీవ్ర విభేదాలు మారకుండా నేరాలు జరిగినప్పుడు మాత్రమే కలుగచేసుకుని హింసకి తగిన శిక్షలు వేసే చట్ట వ్యవస్థ కోసం పోరాడితే సరిపోతుందా?

పై ప్రశ్నకి సమాధానం కాదు అనుకుంటే, ఆయా వ్యక్తులు స్వేచ్ఛ, సమానత్వం గురించి చేస్తున్న వ్యక్తిగత పోరాటాలని అర్థం చేసుకోవటానికి, బలోపేతం చెయ్యటానికి అవసరమయిన సామాజిక సంస్కృతిని ఎలా రూపొందించాలి అన్న ప్రశ్నకి దారి తీస్తుంది. చట్టాలు కొన్ని వనరులు కల్పిస్తాయి గానీ, వాటిని వాడుకోవటానికి బాధితుల వద్ద అవసరమయిన వనరులు ఉండవని, న్యాయస్థానాలని చేరుకోవటానికి కావాల్సిన మార్గాలు మన సమాజంలో ఇంకా రూపొందలేదన్న విషయం మనందరికీ తెలిసిందే. ఆయా రాజకీయ మార్పుల కోసం పోరాడుతున్న సంఘాలుగా మనం ఈ సంక్లిష్ట మార్పులని గురించి అర్థం చేయించటానికి అవసరమయిన సాంస్కృతిక, సామాజిక వనరులు ఏ విధంగా సమకూర్చుకోగలం?

లైంగిక హింస, వేధింపులు, వ్యక్తిగత స్వేచ్ఛా భావజాలంతో పాటు అంతే తీవ్రంగా ఆధునిక రంగాల్లో – విద్యా రంగంలో, మీడియా రంగంలో, సినిమా రంగంలో ఇంకా అనేక రంగాల్లో నైతికత పేరుతో అమలవుతున్న, పెరుగుతున్న సామాజిక పెత్తందారీతనాన్ని, పితృస్వామ్యాన్ని గురించి అటువంటి అవగాహన ఏర్పర్చుకోవటం, సమాజంలో పెంచటం ఎలా? ఇది సమాజంలో ఆమోదింప బడిన నైతికతతో విభేదిస్తుంది. కాబట్టి దీని గురించి చర్చించటం కూడా కష్టమే. ఇప్పటికీ లైంగిక హింసకి, వేధింపులకు పరిష్కారం నేరస్థులకు తీవ్ర శిక్షలు

వెయ్యటంగానే సమాజం, బాధితులు చూస్తున్నారు. ఆయా స్త్రీలని, బాధితుల్ని సంబాళించి, స్థిరపరచి, సమాజంలో అవమానానికి గురవ్వకుండా చెయ్యాల్సిన ప్రయత్నాలు ప్రారంభం కూడా కాలేదు. ఇతర లింగాల వ్యక్తులకి, స్త్రీలకి, పురుషులకి చట్టంలో, చట్టం బయటా అవసరమయిన సహాయ సహకారాలు ఏమిటన్న అవగాహన కూడా మనకి ఉందా?

కుల, లింగ పరమయిన తీవ్ర అసమానతలు వున్నప్పటికీ కుటుంబ వ్యవస్థ మాత్రమే కొత్త దంపతులకి ఇప్పటికీ ప్రధాన సహకార వ్యవస్థ. కులాంతర వివాహాలు చేసుకున్న యువతీ యువకులకి, కుటుంబాల నుండి ఎదురవుతున్న హింస నుండి రక్షణ మాత్రమే కాక, అనేక ఇతర సహాయ సహకారాలు కూడా అవసరమవుతాయి. కొంత వెసులుబాటు ఉన్నప్పటికీ కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవటం చట్ట పరంగా ఇప్పటికీ కష్టమే. రిజిస్ట్రార్ ఆఫీస్ నుండి మేజిస్ట్రేట్ కోర్టు క్లర్కులు వరకు తల్లి తండ్రులకి, బంధుగణానికి ఉప్పందించటానికి సిద్ధంగా వుంటారు. వయోజనులుగా యువతీ యువకుల్ని గుర్తించటానికి చట్ట వ్యవస్థని సిద్ధ పరచటం అత్యంత అవసరం. దానితో పాటు కులం, మతం, జెండర్ సంప్రదాయాలని ధిక్కరించటానికి సమాజాన్ని సాంస్కృతిక పరంగా సిద్ధం చెయ్యటం అవసరం. దానికి ముందుగా వివిధ సంఘాల మధ్య చర్చ, సహకారం చాలా అవసరం: దళిత సంఘాలు, హక్కుల సంఘాలు, స్త్రీల సంఘాలు, విద్యార్థి సంఘాలు మొ.వి. ఆయా సంసిద్ధత, సహకారం, సామర్థ్యం పెంపొందించుకోవటానికి సంసిద్ధంగా వున్నాయా?

ఇవి తేలిగ్గా సమాధానం దొరికే ప్రశ్నలు కావు. ప్రస్తుత హింసాపూరిత, నయా ఉదారవాద సందర్భంలో లైంగిక హింస, వేధింపులు పెరగబోతున్నాయి తప్ప తగ్గేవి కావన్నది హక్కుల కార్యకర్తలనందరినీ కలవర పెట్టే విషయం. కానీ ఇదే చారిత్రక సందర్భం లైంగికత గురించి కొన్ని విషయాలని వ్యక్తిగతాన్ని ముందుకు తెచ్చి లైంగిక హక్కుల స్పృహకి దారి తీస్తోందనటంలో ఏ సందేహం లేదు. స్త్రీ పురుష సంబంధాల్లో లైంగిక ఆనందం పురుషులతో పాటు స్త్రీలకి అంతే అవసరం అని ముందుకు తెచ్చింది. అంతే కాదు, లైంగిక ఆనందం పర లైంగిక సంబంధీకులకి మాత్రమే కాక సమ లైంగికులకి కూడా ఒక జీవన హక్కుగా ముందుకు వచ్చింది. రెండవది, భాగస్వామి అంగీకారం/ అనుమతి/


సమ్మతి లేకుంటే అది శృంగారం లేదా సెక్స్ కాదని, దాన్ని అక్కర్లేని స్పర్శ, వేధింపులు లేదా దాడి అనాలనే స్పృహ కల్పించింది. భాగస్వామి అంగీకారం శృంగారంలో ఇంత ప్రధాన అంశంగా ఇంతకు ముందు చర్చలోకి రాలేదు. స్త్రీలు, పురుషులు, ఇతర జెండర్ల వ్యక్తులు తమకి కావాల్సిన భాగస్వాముల్ని, ఒకే జెండర్‌లోనో, ఇతర జెండర్లలోనో, లేదా పర కులాల లోనో, మతాల లోనో వెతుక్కునే స్వతంత్రం వుండాలన్న స్పృహ ఆయా యువతీ యువకులపై పెరుగుతున్న హింస మధ్యలోనే రూపుదిద్దు కుంటోంది. వీటితో పాటు, అన్ని విషయాల లాగే, లైంగిక జ్ఞానం విద్యాలయాల్లో ఇప్పటికైనా ఇవ్వాలని ప్రచారం చెయ్యటం అవసరం అన్న ఆలోచన, స్త్రీలు, పురుషులు వివాహానికి ముందు సెక్స్‌లో పాల్గొనటం తప్పు కాదని, కానీ అది బాధ్యతతో చెయ్యాలని, భార్య అయినా, భార్య కాకపోయినా ఆమె అంగీకారం ప్రతి సారీ అవసరమేనన్న ఆలోచనలు – ఇవన్నీ హక్కుల స్పృహని పెంచేవే. ఆయా వ్యక్తులకి తమ శరీరంపై, జీవితంపై, ఆనందంపై అధికారాన్నిచ్చేవే. దాంపత్య శృంగారంలో భార్య అనుమతి అవసరం అని అందరూ భావించే రోజు కూడా త్వరలో రావాలని ఆశిస్తూ ఇంక ముగిస్తాను.

❖

**ఈ వ్యాసం రాయటానికి ఉపయోగపడిన కొన్ని వ్యాసాలు, గ్రంథాలు:**


- విమెన్ ఎగైనెస్ట్ సెక్సువల్ అండ్ స్టేట్ వయోలెన్స్ బృందం రాసిన రేప్ అస్ అట్రాసిటీ ఇన్ కాంటెంపరరీ హర్యానా, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వాల్యూమ్ 50, ఇష్యూ 44, 31 అక్టోబర్ 2015
- ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ – ఎడిటోరియల్, జనవరి 2013
- నీర్జా గోపాల్ జయాల్, సిటిజెన్షిప్ అండ్ ఇట్స్ డిస్కంటెంట్స్: యాన్ ఇండియన్ హిస్టరీ, న్యూ ఢిల్లీ,పెర్మనెంట్ బ్లాక్, 2013
- చిన్మయి తుంబె, ఇండియా మూవింగ్: ఎ హిస్టరీ అఫ్ మైగ్రేషన్, న్యూ ఢిల్లీ, పెంగ్విన్, 2018.
- ఆదిత్య నిగమ్, ఇన్సరక్షన్ అఫ్ లిటిల్ సెల్ఫ్స్: ది క్రైసిస్ అఫ్ సెక్యులర్ నేషనలిజం ఇన్ ఇండియా, న్యూ ఢిల్లీ, ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 2006.
- నివేదిత మీనన్, సీఇంగ్ లైక్ ఏ ఫెమినిస్ట్, న్యూ ఢిల్లీ ,పెంగ్విన్, 2012.
- పవర్ అండ్ రిలేషన్షిప్స్ ఇన్ ఎకడెమియా, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, 2017
- గౌతమ్ భాన్, ఫర్ అల్ డట్ వి మే బికమ్: ఆన్ ది సెక్షన్ 377 వర్డిక్ట్, ది హిందూ, సెప్టెంబర్ 7, 2018.


❖



**నూరుపూలు వికసించనీ..**
**వేయి ఆలోచనలు సంఘర్షించనీ..**

బుద్ధిజం నుండి గాంధీజం దాకా, మార్క్సిజం నుండి అంబేద్కరిజం దాకా, విప్లవోద్యమాల నుండి అస్థిత్వ ఉద్యమాల దాకా అందరూ ఎవరి పద్ధతుల్లో వాళ్ళు సమాజాన్ని మానవీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. సమాజాన్ని మానవీకరించే కృషి బహుముఖాలుగా నిరంతరం జరుగుతూనే ఉంటుంది. వీటిలో ఏ ఒక్క ధోరణో సమాజంలోని అన్ని రుగ్మతలను పరిష్కరించగలదని అనుకోవడానికి ఆస్కారం లేదని మా భిన్నస్వరాల ఏకాభిప్రాయం.

ప్రధాన స్రవంతి భావజాలాన్ని వ్యతిరేకిస్తూ ముందుకు వచ్చే ప్రత్యామ్నాయ భావజాలంలో కూడా అనేక కొత్తగొంతుకలు వినిపిస్తున్నాయి. ఆ కొత్త గొంతుకులకు విస్తృత ప్రచారం కల్పించి చర్చకు దోహదపడాలని భిన్నస్వరాలు భావిస్తుంది.

13 జనవరి 2018న తెనాలిలో 'హిందూత్వ రాజకీయాలు - సామాజిక మూలాలు' అనే అంశంపై రాణి శివశంకర్ శర్మ చేసిన బి.చంద్రశేఖర్ స్మారకోపన్యాసం మా మొదటి ప్రచురణ.

7 అక్టోబర్ 2018న హైద్రాబాద్‌లో జరిగిన బాలగోపాల్ స్మారక సదస్సులో ఎ. సునీతగారు 'లైంగికత - లైంగిక హక్కులు - లైంగిక హింస' అంశంపై చేసిన ప్రసంగ వ్యాసం మా రెండవ ప్రచురణ.

మారుతున్న లైంగికత, కొత్త లైంగిక హక్కులు ప్రజామోదం పొందుతున్నాయని, రాజ్యం కూడా ఆ హక్కుల్ని వ్యవస్థీకృతం చేస్తున్నదని, ఈ మార్పుకు ప్రధాన కారణం ప్రజా ఉద్యమాలు మాత్రమే కాదని, భారతదేశంలో నిరంతరాయంగా అన్ని రంగాలలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాలేనని సునీతగారు అభిప్రాయపడుతున్నారు. మన దేశంలో లైంగిక హక్కుల కోసం పోరాడింది గే, లెస్బియన్స్, ట్రాన్స్‌జెండర్ ఉద్యమాలేనంటూ పాతతరం స్త్రీ వాదులు చర్చించని పలు కొత్తకోణాలను ప్రస్తావించారు. ఈ అభిప్రాయాలపై విస్తృత చర్చ జరుగుతుందని ఆశిస్తూ...

**-భిన్న స్వరాలు**
*సాహితీ సాంస్కృతిక వేదిక*
*తెనాలి.*